


www.aksharamtelugudaily.com
RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం
సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక
SUPHALA AKSHARAM

TUESDAY 29TH JULY 2025 EDITOR: SHAIK.YACOOB PASHA PAGES: 12 VOLUME: 08 ISSUE: 123 COST: 3/- TELANGANA

మంగళవారం 29 జూలై 2025 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 08 సంచిక : 123 వెల : రూ.3/- తెలంగాణ


CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## నిండుకుండలా సాగర్ జలాశయం

నల్గొండ,జూలై28 (అక్షరం న్యూస్)
ఎగువ నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో సోమవారం నాగార్జున సాగర్ డ్యాం నిండుకుండను తలపిస్తుంది. శ్రీశైల ప్రాజెక్టు నుంచి 93,127 క్యూసెక్కుల వరద సాగర్‌కు వచ్చి చేరుతున్నది. ఇప్పటికే పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో పాటు- ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుండటంతో క్రస్టు గేట్లను ఎత్తడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. మంగళవారం ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తే అవకాశం ఉన్నట్లు- తెలుస్తుంది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 583.8 అడుగులుగా ఉంది.

# ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనం

- మన సైనిక సత్తాను ప్రపంచమంతా గుర్తించింది
- ఉగ్రదాడికి ప్రతీకారంగానే ఉగ్రమూకలపై దాడి
- పాక్ దాడిని ప్రతిదాడితో ఘోరంగా దెబ్బతీసాం
- మన సైన్యం నిర్వహించిన పాత్ర అమోఘం
- లోక్‌సభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చలో రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, జులై28 :** (అక్షరం న్యూస్)
ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనమని, మన వీరజవాన్ల పాత్ర వెలకట్ట లేనిదని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన సత్తా చాటామని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో సోమవారంనాడు ప్రత్యేక చర్చను రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టింది. దీనిపై ప్రత్యేక చర్చలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటూ, కేవలం 22 నిమిషాల్లో ఆపరేషన్ సిందూర్ పూర్తి చేశామని చెప్పారు. పహల్గాం దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని రాజ్‌నాథ్ ఆవేదన వ్యక్తం చేశారు.ఇందుకు ప్రతిగా పాక్ ఉగ్రవాద స్థావరాలపై వ్యూహాత్మకం గా దాడి చేశామని, 9 ఉగ్ర శిబిరాలను భారత సైన్యం ధ్వంసం చేసిందని, 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టు-బెట్టిందని సభకు తెలిపారు. పాక్‌లో సామాన్యులకు ఇబ్బంది లేకుండా దాడులు చేశామన్నారు. సిందూర్ అనేది వీరత్వం, శౌర్యానికి ప్రతీక అని అభివర్ణించారు. ఉగ్రవాద శిబిరాలు, వారి మద్దతుదారులను లక్ష్యంగా చేసుకుని వారిని మట్టు-బెట్టడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టామని అన్నారు. ఆత్మరక్షణ

➤ మిగతా 2వ పేజిలో..



## పాక్‌తో కాల్పుల విరమణలో మూడో వ్యక్తి లేడు

### ట్రంప్ జోక్యంపై పరోక్షంగా లోక్‌సభకు జైశంకర్ వివరణ

**న్యూఢిల్లీ, జులై28 :** (అక్షరం న్యూస్)
భారత్-పాక్ మధ్య ఇటీవల జరిగిన కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం ఎంతమాత్రం లేదని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో

➤ మిగతా 2వ పేజిలో..

## కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

- పహల్గామ్ ఉగ్రవాదుల హతం
- నలుగురిలో ముగ్గురిని మట్టుబెట్టినట్లు సమాచారం



**శ్రీనగర్, జూలై28 :** (అక్షరం న్యూస్)
జమ్మూ కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరగింది. రెండు నెలల క్రితం పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడ్డ నలుగురిలో ముగ్గురిని భద్రతా బలగాలే ఎన్‌కౌంటర్ చేశాయి. అమాయకుమైన 26 మంది టూరిస్టుల్ని పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ, లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెస్టిస్టెంట్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)' ఉగ్రవాదులు చంపేశారు. ప్రకృతి అందాలను చూడటానికి వచ్చిన పర్యాటకుల్ని మతం పేరు అడుగుతూ చంపేశారు. ఈ ఘటన తర్వాత సంఘటనా స్థలం నుంచి పారిపోయారు. అయితే, ఈ

➤ మిగతా 2వ పేజిలో..



## గద్వాల పత్తి రైతులకు రూ. 700 కోట్ల బకాయిలు

- వెంటనే చెల్లించాలని విత్తన కంపెనీలకు ఆదేశం
- నెలలుగా బకాయిల చెల్లింపులో ఆలసోయంపై ఆగ్రహం
- మంత్రి జూపల్లితో కలసి సచివాయంలో తుమ్మల సమీక్ష

➤ మిగతా 2వ పేజిలో..

## రాష్ట్రంలో మీనాక్షి పాదయాత్రలు

- కార్యకర్తలతో కలిసి సమావేశాలు
- జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు పర్యటనలు



హైదరాబాద్, జులై28 (అక్షరం న్యూస్
తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తన నియోజకవర్గ పర్యటనలో భాగంగా పాదయాత్రలను ప్రారంభించబోతున్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు వివిధ నియోజకవర్గాల్లో పాదయాత్రలు, శ్రమదానం కార్యక్రమాలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్లు- పార్టీ వర్గాలు వెల్లడించాయి.పాదయాత్రల షెడ్యూల్ ప్రకారం, జూలై 31న పరిగి పట్టణంలో సాయంత్రం పాదయాత్ర చేపట్టనున్నారు. ఈ పాదయాత్ర అనంతరం పరిగి లో రాత్రి బస చేయనున్నారు. ఆగస్టు 1న ఉదయం శ్రమదానం కార్యక్రమంలో

➤ మిగతా 2వ పేజిలో..

## ఖమ్మం జిల్లా పర్యాటక అభివృద్ధికి పెద్దపీట

- ఎకో, టెంపుల్ టూరిజంల అభివృద్ధికి ప్రణాళికలు..
- అధికారులతో సమీక్షలో మంత్రులు తుమ్మల, జూపల్లి



హైదరాబాద్, జులై28 : ( (అక్షరం న్యూస్
ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వివిధ చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి పరిచి టూరిజం సెక్టార్‌ను బలోపేతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, హార్టికల్చర్, హ్యాండ్లూమ్ టెక్స్ టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాల యంలో రాష్ట్ర పర్యాటక, ప్రొహిబిషన్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ ఎం.డి.

➤ మిగతా 2వ పేజిలో..

## సిగాచీ మృతుల కుటుంబాలకు అందని సాయం

### కోటి పరిహారం ప్రకటించినా బాధితులకు దక్కలేదు

### కుటుంబాలతో కలసి కలెక్టరేట్‌కు హరీష్ నిరసన



**సంగారెడ్డి, జూలై28 :** (అక్షరం న్యూస్
సిగాచీ బాధిత కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిగాచీ ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆయన సంగారెడ్డి అదనపు కలెక్టర్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సిగాచీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇప్పిస్తామని సీఎం చెప్పారు. రోజులు


➤ మిగతా 2వ పేజిలో..

# సిగాచీ మృతుల కుటుంబాలకు అందని సాయం

**మొదటిపేజీ తరువాయి..** గడుస్తున్నా.. ఎవరూ పట్టించు కోవడం లేదు. పరిహారం అందలేదని బాధిత కుటు-ంబసభ్యులు ఆందోళనలో ఉన్నారు. ఎప్పుడు పరిహారం ఇస్తారని నిలదీస్తున్నారు. పరిహారం కోసం అధికారులను కలిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారు. కొన్ని కుటు-ంబాలకు రూ.లక్ష పరిహారమే అందింది. మృతులు, క్షతగాత్రుల వివరాలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఎంత మందికి పరిహారం ఇచ్చారో అధికారికంగా చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిగాచీ పరిశ్రమలో పేలుళ్లు సంభవించి 54 మంది మరణించారని, ఈ దుర్ఘటన జరిగి నెలరోజులైనా బాధిత కుటుంబాలకు పరిహారం అందలేదని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం బాధిత కుటుంబాలతో కలిసి ఆయన సంగారెడ్డి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడ అడిషనల్ కలెక్టర్‌ను కలిసి.. బాధిత కుటు-ంబాలకు మృతదేహాలను అందించడంలో, పరిహారం అందించడంలో ప్రభుత్వ వైఫల్యంపై నిలదీశారు. ఆ తర్వాత హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. 'సిగాచి ఘటన జరిగి నెల రోజులు కావొస్తున్నది. బాధిత కుటుంబాలు కన్నీళ్ల మధ్య నెలమాసికాలు చేసుకుంటు-న్నారు. ఘటన జరిగినప్పుడు సీఎం వచ్చి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించారు. ఇప్పటికి నెల రోజులు అయ్యింది. ఒక్కరికి కూడా ఎక్స్‌గ్రేషియా అందలేదు. అంతిమ కార్యక్రమాలు జరిపేందుకు శవాలు కూడా ఇవ్వని దుస్థితి ఉంది. బూడిదను తీసుకువెళ్లి గోదావరిలో కలుపుకున్నమని బాధితులు కన్నీరు పెట్టు-కుంటు-న్నారు. ఉమ్మడి ఏపీలో, మన రాష్ట్రంలో ఇంత దారుణమైన ప్రమాద ఘటన ఎన్నడూ జరగలేదు. 54 మంది చనిపోతే ప్రభుత్వ స్పందన అత్యంత దయనీయంగా ఉంది. ఇది పూర్తిగా బాధ్యతారాహిత్యం. ఎక్స్ గ్రేషియా, డెత్ సర్టిఫికెట్ ఎప్పుడు ఇస్తారని అడిగితే.. ఎస్ఎల్బీసీ ఘటనలో శవాలు కూడా దొరకలేదు, మీకు బూడిదైనా దొరికిందని అత్యంత అమానవీయంగా మాట్లాడుతున్నారని బాధితులు చెబుతున్నారు. ఏపీ, బీహార్, జార్ఖండ్, యూపీ నుంచి వచ్చి ఉండాలంటే 20 నుంచి 30 వేలు ఖర్చవుతుందని బాధితుల కుటు-ంబసభ్యులు బాధపడుతున్నారు. సీఎం కోటి ఇస్తామన్నరు, ఎప్పుడు ఇస్తారు, ఎవరు ఇస్తారని అడిగితే ఎవరూ చెప్పడం లేదని బాధిత కుటు-ంబీకులు అంటు-న్నారు. చాలామంది ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నారు. తీవ్రంగా గాయపడ్డవారికి సీఎం పది లక్షల రూపాయలు ఇస్తామని చెప్పారు. కానీ రూ.50 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. నెల గడిచినా ఎంతమంది చనిపోయారు, ఎంతమంది క్షతగాత్రులు అనే విషయాన్ని అధికారికంగా వెల్లడించలేదు. చనిపోయినవారి పేర్లు, ఎవరెవరికి ఎంత ఇచ్చారు, క్షతగాత్రులకు ఎంత ఇచ్చారు అనేది ఈ ప్రభుత్వం ఎందుకు దాచి పెడుతున్నది..? ఇప్పటివరకు నష్టపరిహారం వివరాలు వెల్లడించకుండా ఎందుకు గోప్యంగా ఉంచారో సమాధానం చెప్పాలన్నారు.

చనిపోయిన జగన్మోహన్ కొడుకు యశ్వంత్ ఇచ్చిన ఫిర్యాదులో.. సిగాచి కంపెనీలో పాత మిషన్ వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని అనేకసార్లు కార్మికులు చెప్పినా, కంపెనీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. అంటే యాజమాన్యం పూర్తి నిర్లక్ష్యంగా ఉంది. ఎందుకు యాజమాన్యం మీద కేసు పెట్టలేదు. ఫిర్యాదులో స్పష్టంగా ఉంది. ఎఫ్ఐఆర్ కూడా అయ్యింది. ఎందుకు యాజమాన్యాన్ని కాపాడుతున్నవు రేవంత్ రెడ్డి..? ఎందుకు యాజమాన్యంతో కుమ్మక్కు అయ్యావు..? కంపెనీతో ఉన్న లాలూచి ఏమిటి? బయటపెట్టాలని డిమాండ్ చేస్తున్నాం. శవాలు ఇవ్వకుండా 8 మంది మిస్సింగ్ అంటూ ఎందుకు వేధిస్తున్నారు. వెంటనే డెత్ సర్టిఫికెట్ ఇచ్చి, ఆ కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కంపెనీ కూడా 15 రోజుల్లో పరిహారం ఇస్తామని పత్రికా ప్రకటన ఇచ్చింది. ఇప్పటికీ దిక్కులేదు. ఏపీలో 2024 ఆగస్టు 20న అనకాపల్లిలో ఓ కంపెనీలో ప్రమాదం జరిగి 17 మంది మరణించారు. పలువురికి గాయాలయ్యాయి. వారికి మూడు రోజుల్లో పరిహారం అందించారు. మృతుల కుటు-ంబాలకు కోటి రూపాయలు, తీవ్రంగా గాయపడితే రూ.50 లక్షలు, తక్కువగా గాయపడితే రూ.25 లక్షలు పరిహారం ఇచ్చారు.అసలు ఈ సిగాచీ ప్రమాదం ఎలా జరిగిందో ఎందుకు బయట పెట్టడంలేదన్నారు. అందరికీ డెత్ సర్టిఫికెట్, పంచనామా కాపీ, ఎఫ్ఐఆర్ కాపీలు ఒక ఫోల్డర్‌లో పెట్టి కుటుంబసభ్యులకు ఇవ్వాలన్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడంలో రేవంత్ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న వారికైనా మంచి వైద్యం అందించాలన్నారు. ఎస్ఎల్బీసీ ఘటన జరిగితే సమన్వయం చేయలేదు. సొరంగం భవిష్యత్తు ప్రశ్నార్థకం అయ్యింది. ఎస్ఎల్బీసీలో ఆరు శవాలు, సిగాచిలో 8 మంది శవాలు మొత్తం 14 శవాలు ఏమయ్యాయి..? మిస్సింగ్ అని ఎలా తప్పించుకుంటారు..? బాధితుల గోస వినపడటం లేదా..? సీఎం ఇలాంటి విషయంలో బాధ్యతారాహిత్యంగా ఉండటం సరికాదు. ఇప్పటి-కై-నా కళ్ళు తెరువాలి.

# ఇళయారాజాకు సుప్రీంలో చుక్కెదురు



దిగ్గజ సంగీత దర్శకుడు ఇళయరాజాకు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తనకు చెందిన 500కు పైగా పాటల కాపీరైట్ వివాదాన్ని బాంబే హైకోర్టు నుంచి మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కేసును విచారించిన ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌తో పాటు జస్టిస్ వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి. అంజరియా ఉన్నారు. విచారణ అనంతరం వారు పిటిషన్‌లో ప్రస్తావించిన కారణాలు సరిపోవని తేల్చారు. ఇళయరాజా పేరుతో బాణీలు వెలువడిన అనేక సినిమాల మ్యూజిక్ హక్కులపై గత కొన్ని సంవత్సరాలుగా వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఆయన ఈ వివాదాన్ని తన సొంత రాష్ట్రమైన తమిళనాడులో పరిష్కరించుకోవాలని భావించి మద్రాస్ హైకోర్టుకు కేసును బదిలీ చేయాలంటూ కోరారు. అయితే, సుప్రీంకోర్టు మాత్రం ఈ అభ్యర్థనను అంగీకరించలేదు. దీంతో ఇళయరాజా అభిమానుల్లో ఈ నిర్ణయం నిరాశను కలిగించినప్పటికీ, ఆయన తుది న్యాయపోరాటం ఎలా మలుపుతీసుకుంటుందో చూడాల్సి ఉంది.

# ఆపరేషన్ సిందూర్ భారత్ సత్తాకు నిదర్శనం

**మొదటిపేజీ తరువాయి..** కోసమే సైనిక చర్య తీసుకున్నామని, రెచ్చగొట్టడానికో, విస్తరణవాదంతోనే కాదన్నారు.మే 10వ తేదీన సుమారు 1.30 గంటలకు కూడా ఇండియాపై క్షిపణలు, డ్రోన్లు, రాకెట్లు-, ఇతర సుదీర్ఘ శ్రేణి ఆయుధాలపై దాడులకు పాక్ తెగబడిందని చెప్పారు ఎస్-400, ఆకాశ్ మిజైల్ సిస్టమ్ పూర్తిగా పాక్ దాడులను విఫలం చేశాయని అన్నారు. పాకిస్థాన్‌లోని పలు వైమానిక కేంద్రాలపై భారత వాయిసేన భీకరంగా విరుచుకు పడటంతో పాకిస్థాన్ ఓటమిని అంగీకరించి కాల్పుల విరమణ ప్రతిపాదన చేసిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు విరామం ఇచ్చేందుకు కేవియట్‌తో ఆమోదించామని తెలిపారు. భవిష్యత్తులో పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు.

ముందుగా నిర్ణయించిన రాజకీయ, మిలటరీ లక్ష్యాలు నెరవేరడంతో ఆపరేషన్ సింధూర్‌కు విరామం ఇచ్చిందని, ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామనేదే పూర్తిగా తప్పని వివరించారు. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పకుండా ఉండేందుకే తాను ప్రయత్నించానని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు కూలిపోయాయంటూ కొందరు విపక్ష సభ్యులు ప్రశ్నించారని, అయితే ఆ ప్రశ్న మన జాతీయ భావోద్వేగాలకు ప్రతిబింబించేదిగా లేదని తాను భావిస్తున్నానని రాజ్‌నాథ్ చెప్పారు. ఎన్ని శత్రు విమానాలను కూల్చేశారని మాత్రం విపక్షాలు ప్రశ్నించ లేదన్నారు. ఉగ్రవాద శిబిరాలను కూల్చేశారా అని తప్పనిసరిగా వాళ్లు ప్రశ్నించి ఉంటే దానికి అవునన్నదే తన సమాధానమని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందా అని అడగవచ్చని, అందుకు అవునన్నదే తన సమధానమని అన్నారు. మన సాహస జవాన్లు ఎవరైనా మరణించారా అని అడిగితే లేదన్నదే తన సమాధానమని అన్నారు. మన సైనికులెవ్వరికీ ఎలాంటి హాని జరగలేదని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. రాజ్‌నాథ్ ప్రసంగిస్తున్న సేపు అధికార పార్టీ సభ్యులు బల్లలు చరిచారు. పహల్గాంలో ఉగ్రదాడి హేయమైన చర్య అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మతం పేరు అడిగి మరీ పర్యాటకులను కాల్చి చంపారన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు భారత సైనికులు చాలా జాగ్రత్తలు తీసుకున్నారని, పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దాడులు జరిపారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నాం. ఇలాంటి ఆపరేషన్లు జరిగినప్పుడు చిన్న చిన్న విషయాలు పట్టించుకోకూడదు. 40 ఏళ్లు రాజకీయాల్లో ఉన్నా.. ఇలాంటి ప్రశ్నలు ఎప్పుడూ వినలేదు. ఇలాంటి విషయాల్లో ఆచితూచి, ఆలోచించి ప్రశ్నలు అడగాలన్నారు. 1962లో చైనాతో యుద్ధం జరిగినప్పుడు విపక్షాలు ఎలాంటి ప్రశ్నలు వేశాయో తెలుసుకోవాలి. ఆనాడు విపక్షాలు భారత భూభాగం, మన సైనికుల పరిస్థితి గురించి ప్రశ్నించాయి. మన సైనికుల చర్యను వాజ్‌పేయీ ప్రశంసించారు. 1999లో శాంతియుత పరిస్థితిని కోరుతూ వాజ్‌పేయీ లాహోర్ యాత్ర చేపట్టారు. పాకిస్థాన్‌తో భారత్ స్నేహం కోరుకుంటోందని ఆనాడు వాజ్‌పేయీ చెప్పారు. స్నేహ హస్తం చాచడమే భారత్ గొప్పతనం. ఆనాడు వాజ్‌పేయీ తీవ్ర నిర్ణయం తీసుకుంటే పాక్ మర్నాడు సూర్యోదయం చూసేది కాదు. శాంతి కోరడం భారత్ రక్తంలోనే ఉంది. యుద్ధాలు కోరుకోం. ప్రతి విషయాన్ని మానవత్వ కోణంలో ఆలోచిస్తాం. తుపాకులు పేలితే ఎవరూ మిగలరని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఉగ్రవాదుల అంత్యక్రియల్లో పాకిస్థాన్ అధికారులు పాల్గొన్నారు. దీనిని బట్టి వారిని ఆ దేశం ఎలా పెంచి పోషిస్తుందో స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటివరకు మనం ఎవరిపైనా దాడి చేయలేదు. పాకిస్థాన్ చరిత్ర, అక్కడి ఉగ్రవాదం గురించి తెలుసుకొని మాట్లాడాలి. మనిషి.. నీతి, నిజాయతీతో బతకాలని తులసీదాస్ దోహాలో చెప్పారు. భారత స్నేహహస్తాన్ని పాక్ అందుకోలేకపోయింది. మనదేశ ప్రజలను చంపుతుంటే సైన్యం చూస్తూ ఊరుకోదు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదం.. ఆ దేశానికే ఇబ్బందిగా మారుతుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# కాశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

**మొదటిపేజీ తరువాయి..** ఘటనకు పాల్పడిన ముగ్గురు పాకిస్తాన్ అనుమానిత ఉగ్రవాదుల్ని జమ్మూ కాశ్మీర్‌లో సైన్యం చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. ఈ ఉగ్రవాదులు సైన్యం జరుపుతున్న ఎన్‌కౌంటర్‌లో చిక్కుకున్నట్లు- సంబంధిత వర్గాలు చెప్పాయి. హిర్వాన్ - లిద్వాస్ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగుతోంది. గత 2 నెలలుగా ఈ ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు జమ్మూ కాశ్మీర్ వ్యాప్తంగా విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. 'ఆపరేషన్ మహదేవ్' పేరుతో భద్రతా బలగాలు ఉగ్రవాదుల కోసం వేట మొదలుపెట్టి, ఉగ్రవాదుల్ని హతం చేశారు. భారత సైన్యం, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్), జమ్మూ కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. నివేదికల ప్రకారం, ఈ ముగ్గురు ఉగ్రవాదుల్ని భద్రతా బలగాలు మట్టు-పెట్టినట్లు- తెలుస్తోంది. అయితే, ఈ విషయం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. శ్రీనగర్‌లోని దాచిగమ్ నేషనల్ పార్క్ సమీపంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగాయి. కనీసం ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు చుట్టుముట్టాయి. వీరు పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులని తెలుస్తోంది.హర్వాన్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కినట్లు- నిఘా వర్గాల సమాచారంతో నెల రోజుల నుంచి గాలింపు చేపట్టారు. చివరకు సోమవారం ఉదయం దాచిగమ్ అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపడుతుండగా.. భద్రతా దళాలపైకి ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో గల ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయ వద్ద ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. అతి సమీపం నుంచి కాల్పులు జరిపి 25 మంది పర్యాటకులు, ఓ కశ్మీరీ వ్యక్తి ప్రాణాలు తీశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. అప్పటి నుంచి భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం ముమ్మర వేట సాగిస్తున్నాయి. లష్కరే తయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'కు చెందిన ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లు- ప్రాథమికంగా నిర్ధరించారు.

# రాష్ట్రంలో మీనాక్షి పాదయాత్రలు

**మొదటిపేజీ తరువాయి..** పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు సాయంత్రం ఆందోల్ నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తారు.ఆగస్టు 2న శ్రమదానం కార్యక్రమంతోపాటు- కార్యకర్తల సమావేశం ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు ఆర్మూరు లో పాదయాత్ర చేపడతారు. ఆగస్టు 3న ఉదయం శ్రమదానం నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఖానాపూర్ లో పాదయాత్ర ఉంటు-ంది.ఆగస్టు 4న ఉదయం శ్రమదానం అనంతరం కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం చొప్పదండి లో పాదయాత్ర చేసి రాత్రి బస చేస్తారు. ఆగస్టు 5న ఉదయం శ్రమదానం అనంతరం సమావేశం నిర్వహించి, సాయంత్రం వర్ధన్నపేట లో పాదయాత్ర చేపడతారు. చివరిగా ఆగస్టు 6న శ్రమదానం, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పాదయాత్రలను ముగిస్తారు.

# ఖమ్మం జిల్లా పర్యాటక అభివృద్ధికి పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి..** వల్లూరి క్రాంతి, జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఏకో , టెంపుల్ టూరిజంలను అభివృద్ధిపరిచే ప్రణాళికలను సిద్ధం చేయాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. పాలేరు రిజర్వాయర్, నేలకొండపల్లి వద్ద ఉన్న బౌద్ధస్థూపం, పర్ణశాల, భద్రాచలం టెంపుల్, కిన్నెరసాని ప్రాజెక్టు, కొత్తగూడెం వద్ద హరితహోటల్, కనిగిరిహిల్స్, వైరా రిజర్వాయర్, వెలుగుమట్ల అర్బన్ పార్కు, ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే, ఖమ్మంలో కొత్తగా ఒక హరిత హోటల్‌లను నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో టూరిజం డెవలప్‌మెంట్‌కు అనువైన వాతావరణం, ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, ఆలయాలు ఉన్నాయని, వాటిని ప్రజలకు అందుబాటు-లోకి తేవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మంత్రులు తెలిపారు. దేశంలో ప్రసిద్ధిగాంచిన భద్రాచలం రామాలయంను మరింత అభివృద్ధిపరిచి భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని, ఇందుకు టూరిజం డిపార్టుమెంట్, కార్పొరేషన్‌లు కృషి చేయాలని మంత్రులు తెలిపారు. అందుకు కావాల్సిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గాని, ప్రైవేట్ భాగస్వామ్యంలో గాని వెంటనే మంజూరి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. జిల్లాలో టూరిజం డిపార్టుమెంట్ అధికారులు, జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి తగు కార్యాచరణను రూపొందించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెలలో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారని, టూరిజం ప్రాజెక్టులకు సంబంధించిన ప్రదేశాలను సందర్శించే అవకాశం ఉన్నందున, తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మం పట్టణ సమీపంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అటవీ ప్రదేశంలో ఏకో టూరిజంకు సంబంధించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లా ఖమ్మం పట్టణంలో హరిత హోటల్ నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని, కొత్తగూడెంలో ఉన్న హరితహోటల్ ని అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.

# పాక్‌తో కాల్పుల విరమణలో మూడో వ్యక్తి లేడు

**మొదటిపేజీ తరువాయి..** సోమవారం ప్రత్యేక చర్చలో జైశంకర్ పాల్గొంటూ.. కాల్పుల విరమణకు సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని చెప్పారు. అమెరికా మధ్యవర్తిత్వంపై వస్తున్న ఊహాగానాలను కొట్టివేశారు. ఏప్రిల్ 22- జూన్ 17 మధ్య ప్రధానమంత్రి మోదీ, డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ కాల్ సంభాషణలు జరగలేదని సభకు వివరించారు. భారత్-పాక్ మధ్య డైరెక్ట్ కమ్యూనికేషన్ అనంతరమే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చినట్టు- చెప్పారు. ఇందులో మూడో పార్టీ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. పాకిస్థాన్ కాల్పులపై భారత్ విరుచుకుపడటంతో కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నాంటూ పాక్ నుంచి భారత ప్రభుత్వానికి ఫోన్ కాల్స్ వచ్చాయని, అయితే ప్రొటోకాల్ ప్రకారం ఇలాంటి సమాచారం అధికారికంగా పాకిస్థాన్ డీజీఎంఓ నుంచి రావాలని ఇండియా పట్టు-పట్టిందని జైశంకర్ సభకు తెలిపారు. లష్కరే తొయిబా ప్రాక్సీ అయిన ది రెసిస్టెంట్ ఫ్రంట్ ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించడం వెనుక భారత దౌత్యానికి క్రెడిట్ దక్కుతుందని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదానికి చిరకాలంగా పాకిస్థాన్ మద్దతిస్తున్న విషయాన్ని ఇండియా బలంగా ప్రపంచ దేశాల ముందుకు తీసుకువెళ్లిందన్నారు. ప్రపంచానికి పాకిస్థాన్ నిజస్వరూపం వెల్లడించడంలో సక్సెస్ అయ్యామని చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించేది లేదనే విధానాన్ని ఇండియా అనుసరిస్తోందన్నారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై పోరు కేవలం ఆపరేషన్ సిందూర్‌కు పరిమితం కాదని, దేశ ప్రజలు, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని చెప్పారు. జాతీయ భద్రతపై భారత్ దృఢ వైఖరి కొనసాగిస్తుందని, పాకిస్థాన్ జాతీయులకు వీసా ఆంక్షలు కొనసాగుతాయని వివరించారు. ఉగ్రవాదం ముప్పును ఎదుర్కొనేందుకు అనుసరిస్తు విస్తృత వ్యూహంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# గద్వాల పత్తిరైతులకు రూ. 700 కోట్ల బకాయిలు

**మొదటిపేజీ తరువాయి..** మంత్రి మాట్లాడుతూ గద్వాల జిల్లా రైతులు సుమారు 50వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను సాగు చేశారని, నెలల గడిచినా ఇప్పటి వరకు వారికి సంబంధిత కంపెనీలు చెల్లింపులు చేయలేదని స్థానిక ఎంఎల్ఎ కృష్ణమోహన్‌రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలిగినా సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.గద్వాల జిల్లా రైతాంగం పత్తి విత్తనాల ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, దేశానికి తలమానికమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. విత్తన ఉత్పత్తి చేసి కంపెనీలకు అందిస్తే ఆయా కంపెనీలు రైతులకు ఇప్పటి వరకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా ఆయా కంపెనీలు తక్షణమే స్పందించి నెలరోజుల్లోగా ఉన్న బకాయిలను రైతులకు చెల్లించి వారిని ఆదుకోవాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా లాంటి కార్యక్రమాలతో రాష్ట్ర రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. వేల కోట్ల రూపాయలు రైతులకు ఇచ్చి ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకుంటు-ందన్నారు. రైతులకు లాభం, సౌకర్యం, సంక్షేమం మా ప్రాధాన్యమని మంత్రి అన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎంఎల్ఎ కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర విత్తన అభివృద్ధి స్థంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ గోపిలు పలు సీడ్ కంపెనీ ప్రతినిధులతో సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్ర సీడ్స్ మెన్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణ, ప్రవీణ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

## విద్యను మళ్లీ ప్రారంభించుకోండి

- ఓపెన్ స్కూల్ ద్వారా భవిష్యత్తు నిర్మించుకోండి
- అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ .



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జులై 28/అక్షరం న్యూస్ -

ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా పాఠశాల స్థాయిలోనే చదువును మానివేసిన వారికి లేదా పదోతరగతి పూర్తయిన తర్వాత ఇంటర్మీడియట్ చదువు కొనసాగించలేకపోయిన వారికి తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) మళ్లీ చదువుకునే అవకాశాన్ని కల్పిస్తోంది అని జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ వారు రూపొందించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విధానంలో చేరినవారు తమ ఉపాధి మార్గాలను వదులుకోకుండా ఖాళీ సమయాల్లో పాఠ్యాంశాలను అధ్యయనం చేస్తూ, పరీక్షలలో ఉత్తీర్ణులై ప్రామాణికమైన విద్యార్హతను పొందవచ్చు అని తెలిపారు. రెగ్యులర్ పాఠశాలలలో చదివినవారి సర్టిఫికెట్లతో సమానమైన గుర్తింపు ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు కలిగి ఉంటాయి అన్నారు. ఓపెన్ విధానంలో కేవలం ఐదు సబ్జెక్టులతో పదోతరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించవచ్చు అని, ఇంటర్మీడియట్‌ను ఒకే సంవత్సరంలో పూర్తిచేసుకునే అవకాశమూ ఉంటుంది అన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను ఓపెన్ స్కూల్ కేంద్రాల ద్వారా ఉచితంగా అందజేస్తారు అని తెలియజేశారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందేందుకు 2025 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు నిండినవారు పదోతరగతికి అర్హులు కాగా, 15 సంవత్సరాలు వయస్సు నిండినవారు, పదోతరగతి ఉత్తీర్ణులైనవారు ఇంటర్మీడియట్‌కు అర్హులు. వయస్సు ధృవీకరణ పత్రంగా టి.సి., రేషన్ కార్డు లేదా సంబంధిత అధికారులిచ్చిన పుట్టినతేదీ ధృవీకరణ పత్రం సరిపోతుంది అని తెలిపారు . అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులు 31 జూలై 2025 లోపు స్వీకరించబడతాయి అన్నారు. అనంతరం 01 ఆగస్టు 2025 నుండి 28 ఆగస్టు 2025 వరకు అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. పదోతరగతికి రూ.100, ఇంటర్మీడియట్‌కు రూ.200గా రిజిస్ట్రేషన్ రుసుము నిర్దేశించబడింది. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు %షష్.వశ్రీఖఅ-స్త్రుఖుశీజూవఅంఎష్త్రశీశ్రీ.శీతీస్త్ర% వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మద్దినేని పాపారావును సెల్ నెంబర్ 8008403522 లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, మద్దినేని పాపారావు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి, డిప్యూటీ జెడ్పి సీఈవో చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ అధికారి పృథ్వి మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో "ఏక్ పెడ్ మా కె నామ్" కార్యక్రమం




చొప్పదండి /కరీంనగర్,జులై 28 (అక్షరం న్యూస్)

నెహ్రూ యువ కేంద్ర మరియు నవతరం యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "ఏక్ పెడ్ మా కె నామ్" కార్యక్రమంలో భాగంగా చొప్పదండి మండల్ రుక్మాపూర్ మోడల్ స్కూల్ లో మొక్కలు నాటినారు.విదార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు గెలుపొందిన వారికి బహుమతులు పరదానం చేసినారు.నవతరం యూత్ అధ్యక్షుడు జాగీరి సాయి గణేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడం కోసం బాధ్యతగా చెట్లు నాటి వాటిని సంరక్షించాలని అప్పుడే మంచి వాతావరణం (కాలుష్యం లేనటువంటి) ఏర్పడానికి దోహదపడుతుందని సూచించారు.మొక్కలు నాటడంతో మనిషి జీవనానికి ఎంతో తోడ్పడుతుందనీ అన్నారు.

కార్యక్రమంలో చల్లా అనూష్,వడ్లకొండ ఆకాష్,జేశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల గురుకులాన్ని సందర్శించిన మండల విద్యాధికారి పి మోహన్



చొప్పదండి/ కరీంనగర్, జులై 28 (అక్షరం న్యూస్)

చొప్పదండి పట్టణం లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాలను మండల విద్యాధికారి పి మోహన్ శుక్రవారం సందర్శిం చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఉదయం బాలికల గురుకులాన్ని ఆయన సందర్శించారు ఈ సందర్భంగా వంటగదిని క్షుణ్ణంగా పరిశీలించారు కూరగాయలను పరిశీలించారు తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు గురుకులంలో అందిస్తున్న భోజన వసతులను రుచికరమైన వంటలను విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భోజన వసతులు బాగున్నాయని తెలిపారు ఈ సందర్భంగా ఎమ్ఈవో మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు పౌష్టికాహారాన్ని తీసుకుంటేనే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని సూచించారు ప్రతి విద్యార్థి విద్యపై శ్రద్ధ వహించాలని కోరారు సిక్ రూమును సందర్శించి వారితో మాట్లాడారు మెడిసిన్ అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు విద్యార్థుల సమాధానంతో తృప్తి చెందారు గురుకుల నిర్వాణపై సంతృప్తిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ ఎల్ స్వాతి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి లో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి... అదనపు కలెక్టర్ వేణుగోపాల్..

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జులై 28/అక్షరం న్యూస్ -

ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.



### గ్రీవెన్స్ లో వచ్చిన కొన్ని ఫిర్యాదులు.

టేకులపల్లి మండలానికి చెందిన వాంకుడోత్ అశోక్ తాను బిఎస్సి అగ్రికల్చర్ పూర్తి చేసి ఉన్నానని జిల్లాలోని ఏటీఎంఏ ( అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) నందు ఔట్సోర్సింగ్ పరిధిలో ఒక పోస్టుని తనకు ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం జిల్లా వ్యవసాయ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

జూలూరుపాడు మండలం సాయిరాం తండా కు చెందిన గుగులోతు వీరు తన కుటుంబ సభ్యులతో కలిసి తాటాకు ఇంటిలో నివాసం ఉంటున్నానని తేదీ. 26/2/2025 న కరెంటు షార్ట్ సర్క్యూట్ కారణంగా తన ఇల్లు పూర్తిగా దగ్ధమై పిల్లల సర్టిఫికెట్స్, భూమి కాగితాలు, నగదు అన్ని దగ్గం అయ్యాయని తాము నివసించడానికి నివాసం లేక ఇబ్బంది పడుతున్నామని డిజాస్టర్ మేనేజ్మెంట్ కింద ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్య నిమిత్తం హౌసింగ్ పీడీ అధికారి కి ఎండార్స్ చేశారు.

ఇల్లందుకు చెందిన పోకల రాధ తన తల్లి పోకల కోటమ్మ, గతంలో తల్లి పేరు మీద గృహపట్టా మంజూరయ్యిందని, (పట్టా నంబర్: 211). ప్రస్తుతం తన తల్లిదండ్రులు ఇద్దరూ మరణించగా, ఒంటరిగా ఉన్న తనను వారసురాలిగా గుర్తించి, వారసత్వ చట్ట ప్రకారం తమ ఇంటికి సంబంధించి గృహ పట్టాను తన పేరపై మంజూరు చేయవలసిందిగా కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి, తగిన చర్యలు నిమిత్తం ఇల్లందు తహసీల్దార్‌కు ఎండార్డ్ చేయబడింది.

మణుగూరు కు చెందిన బత్తుల రాములు సర్వే నెంబర్ 138/1559 లో ఒక ఎకరం 20 కుంటల భూమి ఉన్నదని దానికి రైతు భరోసా డబ్బులు కూడా వస్తున్నాయని అట్టి పొలం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటులో పోతున్నదని తనకు వ్యవసాయమే జీవనాధారంమని, కావున తన భూమిని తనకు ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్య నిమిత్తం మణుగూరు తాసిల్దారు కు ఎండార్స్ చేశారు.

జూలూరుపాడు మండలం అనంతారం గ్రామానికి చెందిన గడిగ వెంకటేశ్వర్లు తన కుమారుడు గడిగ జస్వంత్ ఎనిమిదో తరగతి చదువుటకు చుంచుపల్లి బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నందు సీటు ఇప్పించగలరని ఒకవేళ చుంచుపల్లి నందు సీటు రాలేనిచో మరి ఎక్కడైనా సీటు ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం ఆర్ సి ఓ కి ఎండార్స్ చేశారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి మధ్య మునగ నాటండి..

- లాభాలను రెట్టింపు చేసుకోండి..
- రైతులకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య సూచనలు ..



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / జులై 28/అక్షరం న్యూస్ - పత్తి పంట మధ్య మునగ సాగు చేయడం ద్వారా లాభాలను రెట్టింపు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ రైతులకు సూచించారు. జిల్లాలోని రైతులకు వ్యవసాయంలో అత్యధిక లాభాలు గడించి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కలెక్టర్ కొన్ని ముఖ్యమైన సూచనలు మరియు సలహాలు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో రైతులు శ్రమించి మంచి పంటలు పండించుకుంటూ వ్యవసాయాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు అని అన్నారు. అయితే ఇంకా కొన్ని అవకాశాలను రైతులు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది అని తెలిపారు. ముఖ్యంగా మునగ సాగు గురించి గత సంవత్సరంలో మేము చేసిన అవగాహన కార్యక్రమాల వల్ల జిల్లాలో దాదాపు 100 ఎకరాల్లో మునగ సాగు జరిగింది అని అలాగే, పత్తితో పాటు మునగను అంతరపంటగా వేసిన రైతుల సంఖ్య కూడా 300 ఎకరాలకు చేరుకుంది. అయినప్పటికీ ఈ పంటలో ఇంకా విస్తృతంగా అవకాశాలున్నాయి అన్నారు.

ప్రస్తుతం రైతులు నాటిన పత్తి జనవరి%-%ఫిబ్రవరి మధ్య కాలంలో పంట తీసుకునే దశకు చేరుతుంది. ఇదే సమయాన్ని ఉపయోగించుకుని ఇప్పటి నుంచే మునగ మొక్కల తయారీకి సిద్ధం కావాలని రైతులకు కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు విత్తనాలు, ప్లాస్టిక్ బ్యాగులు పొందవచ్చు. ఇంటి వద్దే మట్టి, ఎరువుతో కలిపి వీటిలో విత్తనాలు నాటి రెండు మూడు నెలల్లో మంచి మొక్కలు తయారు చేయవచ్చు అని అన్నారు . ఆ మొక్కలను సెప్టెంబరు నాటికి వర్షాలు తగ్గిన అనంతరం పత్తి పొలాల మధ్యలో నాటితే అది పంటగా మేలుచేస్తుంది. ఇది మనకు ఇప్పటికే టేకులపల్లి ప్రాంతంలో హైజా అనే ఆదివాసి ఆదర్శ రైతుల ద్వారా చూపబడిన సాఫల్యమైన పద్ధతి అని తెలిపారు.

మునగ సాగు ద్వారా రైతులు ఆదాయం మరియు ఉపాధి రెండింటినీ సాధించవచ్చు. ఉదాహరణకు వెయ్యి చెట్లు నాటి ప్రతి చెట్టుకు కనీసం 100 కాయలు కాసినా, ఒక్కొక్క కాయకు రూ.2 రేటు వచ్చినా దాదాపుగా రూ.2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చు. అంతేకాకుండా ఆకులు కూడా మార్కెట్లోకి అమ్మితే కిలోకు రూ.10 వరకు రేటు దొరుకుతుంది. మార్కెటింగ్ లో ఎలాంటి సమస్యలూ ఉండవు. ఇప్పటికే మన జిల్లాలో మునగ సాగు చేస్తున్న రైతులు మార్కెటింగ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇతర ఉపాధి అవకాశాల విషయానికొస్తే, మునగ చెట్లకు ఆధారంగా తుమ్మ చెట్లు లేదా వేరే కర్రలను మునగ మొక్కలకు ఆధారంగా గుంతలు తీసి ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి హామీ పథకం ద్వారా రూ.19,000 వరకు లాభం పొందవచ్చు. ఈ విధంగా రైతులు తమ పొలంలో పనిచేసుకుంటూ ఉపాధి హామీ పథకం ద్వారా ఆదాయాన్ని కూడా సమకూర్చుకోవచ్చన్నారు.

డ్రోన్ స్ప్రే వాడటం ద్వారా మందుల పిచికారీ, యూరియా స్ప్రే లాంటి పనులు సులభంగా చేయవచ్చు. యూరియా బస్తాల కోసం పోటీ చేయాల్సిన అవసరం లేకుండా నానో యూరియా వాడితే మొక్కలకు నేరుగా అవసరమైన పోషకాలు అందుతాయి.

అలాగే బోర్ వెల్ పక్కన ఒక కుంట లో ఫామ్ పౌండ్ తవ్వించుకోవడం ద్వారా మంచి భూగర్భ జలాలు అభివృద్ధి పరుచుకోవటంతో పాటు భవిష్యత్ తరాలకు నీరు అందించవచ్చు. ఈ ఫామ్ పౌండ్ ను కూడా ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నిర్మించవచ్చన్నారు. వరిగడ్డి ని వాడుకుంటూ పుట్టగొడుగు సాగు చేపట్టి మంచి ఆదాయం పొందవచ్చు అన్నారు . చేపల పెంపకం కోసం ఎకరాలు ఎకరాలు తవ్వవలసిన అవసరం లేకుండా ఒకే కుంటలో తక్కువ ఖర్చుతో చేపల పెంపకం చేపట్టి పది రెట్ల ఆదాయం పొందే అవకాశాలున్నాయి.

మొక్కజొన్న పండించే రైతులు నీటి సౌకర్యం ఉంటే ఆయిల్ ఫామ్ సాగు చెప్పు చేపట్టాలని దానితో అత్యధిక లాభాలు పొందటంతో పాటుగా ప్రభుత్వం అనేక రకాల సబ్సిడీలను అందిస్తుందని ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది అన్నారు.

వెదురు సాగుపై కూడా రైతులు దృష్టి పెట్టాలి అని కలెక్టర్ సూచించారు . ఒక ఎకరాలో సుమారు 160 మొక్కలు నాటి మూడు నాలుగు సంవత్సరాల్లోనే మంచి ఆదాయం పొందవచ్చు అన్నారు. మధ్యలో అంతరపంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. దీనిలో అంతర్ పంటగా అదనంగా చెట్లు నాటితే మేతకు కూడా ఉపయుక్తంగా ఉంటాయి అన్నారు.

మన జిల్లాలో దాదాపు 2.5 లక్షల మేకలు ఉన్న నేపథ్యంలో మేత అవసరాన్ని తీర్చేందుకు ఇది చక్కటి పరిష్కారం. మేక పాల ఉత్పత్తి ఆధారంగా లెక్కిస్తే ఉన్నదాంట్లో పది శాతం మేక పావు లీటర్ పాలను ఇచ్చిన కూడా ఈ రంగం నుండి సంవత్సరానికి రూ.10-12 కోట్లు వరకు ఆదాయం పొందడం సాధ్యం అవుతుందన్నారు.

పట్టు సెరికల్చర్ పై ఆదివాసీ రైతులు దృష్టి పెట్టాలి. ఇందులో 90% సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుంది. తక్కువ స్థలంలో ఎక్కువ ఆదాయం పొందగలిగే ఈ రంగాన్ని ప్రారంభించేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు వేయాలి అన్నారు. త్వరలోనే మేము ఈ అన్ని అవకాశాలపై ప్రత్యేకంగా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ప్రారంభించబోతున్నాము. అప్లికేషన్లు, సమాచారం, మరియు ఫోన్ నంబర్లను కూడా అందుబాటులోకి తీసుకొస్తాము కలెక్టర్ తెలిపారు.

రైతులందరూ సెప్టెంబర్ నాటికి మునగ సాగు, వెదురు సాగు, చేపల పెంపకం, పుట్టగొడుగులు, సెరికల్చర్ వంటి విభిన్న వ్యవసాయ కార్యకలాపాలను పరిశీలించి, అనుసరించాలి. ఇది రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడమే కాకుండా, ఉపాధిని పెంచే మార్గం కూడా అవుతుంది. మన గ్రామాల్లో అభివృద్ధి దిశగా తీసుకునే కీలక అడుగు ఇదే అవుతుంది అని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ను సన్మానించిన బీసీ ఐక్యవేదిక




భద్రాద్రి కొత్తగూడెం /సుజాతనగర్ / జులై 28/అక్షరం న్యూస్ -: స్థానిక ఎన్నికల్లో బీసి లకు అండగా నిలవాల్సిన భాద్యత అందరిపై ఉందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు అన్నారు. సుజాతనగర్ లోని వారి స్వగృహంలో కలసిన బీసీ ఐక్యవేదిక బీసీ జాతీయ



సలహాదారులు మిట్టపల్లి సాంబయ్య ఆధ్వర్యంలో బీసీ నాయకులు టీపీసీసీ జనరల్ సెక్రటరీ నియమితులవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు నాగా సీతారాములును శాలువాతో సత్కరించి, పూల బొకె అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల గెలుపుకు అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ సలహాదారులు మిట్టపల్లి సాంబయ్య, బీసీ జిల్లా అధ్యక్షులు పిఏ ప్రసాద్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొడగాని శ్రీనివాస్ యాదవ్, బీసీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కొదురుపాక మీనాక్షి, కొత్తగూడెం పట్టణ సెక్రటరీ మహంకాళి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సన్నబియ్యం పంపిణి నిర్ణయం హర్షణీయం





- కొత్త రేషన్ కార్డుల జారీ సాహసోపేత నిర్ణయం.
- కొత్త కార్డులు జారీచేస్తే సరిపోదు.. లబ్దిదారులకు తక్షణమే బియ్యం కేటాయించాలి.
- ఎన్నికల హామీ మేరకు అన్ని రకాల నిత్యావసరాలు అందించాలి.
- నియోజకవర్గంలో 4500 కొత్తరేషన్ కార్డులు అందిస్తున్నాం.
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు .



భద్రాద్రి కొత్తగూడెం /కొత్తగూడెం / జులై 28/అక్షరం న్యూస్ – : ఎన్నికల హామీ మేరకు తెల్ల రేషన్ కార్డు లబ్దిదారులకు సన్నం బియ్యం పంపిణి పథకం అమలు చేయడాన్ని హర్షిస్తున్నామని, సన్నబియ్యం నాణ్యతను మరింత పెంచి పెదలు కడుపునిండా తిండి తినేలా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాలకు సంబందించిన లబ్దిదారులకు వారికి మంజూరైన తెల్ల రేషన్ కార్డులకు సోమవారం వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ ఇప్పటికే చాలా జాప్యం జరిగిందని, కొత్త రేషన్ కార్డుల జారీతో చేతులు దులుపుకుంటే సరిపోదని, తక్షణమే బియ్యం కేటాయింపు జరగాలన్నారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని నిత్యావసరాల పంపిణి చేపట్టాలని సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 8000మంది కుటుంబ సభ్యుల చేర్పింపుతో 4500 కొత్త రేషన్ కార్డులు లబ్దిదారులకు అందిస్తున్నామని, ఇప్పటివరకు పాత రేషన్ కార్డుల్లో 8000 మంది చేర్పింపు జారింది తెలిపారు. కార్డుల ప్రక్రియ నిత్య ప్రక్రియలా కొనసాగేలా ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అర్హులైన ప్రతి పెద్దకుంటుంబాని అందేలా చొరవతీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, చుంచుపల్లి, డిఎస్ఓ రుక్మిణి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్లు రామకృష్ణ, ప్రసాద్, శిరీష, ఎంపిడివోలు శుభాసీని, భారతి, అంకుబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, హన్మంతరావు, దస్రు, కుమారి హన్మంతరావు, వాసిరెడ్డి మురళి, దీటి లక్ష్మిపతి, జక్కుల రాములు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, తాళ్ల వెంకటేశ్వర్లు, పొలమూరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, తూము చౌదరి, చింతలపూడి శేఖర్, ధర్మారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో భద్రాచలం లో హైఅలెర్ట్

**విస్తృతంగా తనిఖీలు చేపట్టిన సీఐ నాగరాజు**



భద్రాద్రి కొత్తగూడెం /భద్రాచలం /జులై 28 /అక్షరం న్యూస్ : మావోయిస్టులు వారోత్సవాల నేపథ్యంలో పట్టణంలో పోలీసులు హై అలెర్ట్ అయ్యారు. సోమవారం సీఐ నాగరాజు ఆధ్వర్యంలో పట్టణ వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులను ఆపి వారి వివరాలను ఆరా తీశారు. వారి వద్ద బ్యాగులను తనిఖీ చేశారు. బస్టాండ్ ఏరియా నుంచి మొదలై యూబీ రోడ్డు, అంబేద్కర్ సెంటర్, చర్ల రోడ్, చెక్పోస్టు మీదుగా నడుచుకుంటూ వెళ్ళి క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా పలు లాడ్జీలను సైతం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లాడ్జీలలో ఉంటున్న వారిని ఆరా తీశారు. పలు ప్రధాన కూడల్లో ద్విచక్రవాహనాలను, ఆటోలను, భారీ వాహనాలను ఆపి సంబంధిత ధృవ పత్రాలను,వాహనాలను తనిఖీ చేశారు. బస్టాండ్ ఏరియాలో పర్యటించి అనుమానితుల బ్యాగులను తనిఖీ చేశారు. ఈ క్రమంలో రోడ్లపై వాహనాలను నిలిపిన వారికి, త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారికి, హెల్మెట్, సంబంధిత దృవపత్రాల లేకుండా అజాగ్రత్తగా వాహనాలను నడుపుతున్న వారిని ఆపి ఫైన్ వేశారు. సీఐ వెంట ఎస్సై శ్యామ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## భద్రాద్రి ప్రజల ఆశలు నెరవేర్చలేక పోతున్న కాంగ్రెస్...

- 20నెలల కాలంగా కరకట్ట పనులు అవుతూనే ఉన్నాయి..మరి ఎప్పుడు పూర్తవుతుంది
- రెడ్డి సత్రం రోడ్లు రిటైనింగ్ వాల్ కూలిన పట్టించుకోవడంలో ప్రభుత్వ విఫలం..
- గత ప్రభుత్వంలో కేటాయించిన నిధులు తప్ప. కాంగ్రెస్ భద్రాచలానికి ఏమి నిధులు ప్రకటించింది..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో భద్రాచలం మండలంపై గులాబీ జెండా ఎగరాలి
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిలదీస్తూ, 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేయాలి..



భద్రాద్రి కొత్తగూడెం /భద్రాచలం /జులై 28 /అక్షరం న్యూస్

భద్రాచలం పర్యటనకు వచ్చిన పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ భద్రాద్రి ప్రజల ఆశలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని.. గత ప్రభుత్వంలో కేరాయించిన కరకట్ట నిర్మాణ పనుల నిధులు పక్క దారి పట్టాయని ఇప్పటివరకు కడుతూనే ఉన్నారని. రెడ్డి సత్రం రోడ్లో కరకట్ట రిటైలింగ్ వాలు కూలిపోయి ప్రజలు భయభ్రాంతులకు గురవుతుంటే కనీసం ప్రభుత్వం పట్టించుకోనే స్థితిలో లేదని అన్నారు. భద్రాచలం అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమి చేసిందో 28 నెలల కాలంలో ప్రజలకు చెప్పాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు కష్టాలు పెరిగాయని, స్థానిక ఎన్నికల్లో భద్రాచలం మండలం పైన గులాబీ జెండా ఎగరాలని కార్యకర్తలు అందరూ సంసిద్ధంగా ఉండి 420 హామీలు అమలు కొరకు ప్రజలు చైతన్యవంతం చేయాలని ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాన్ని ఎండగట్టాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ మానే రామకృష్ణ,మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్,కో కన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు,మండల సీనియర్ నాయకులు పోల్లం జయ ప్రేమ్ కుమార్, అయినాల రామకృష్ణ,సోషల్ మీడియా అధ్యక్షులు మంది నాగేశ్వరరావు,బాసిబోయిన మోహన్ రావు, దుమ్ముగూడెం మండల నాయకులు రావులపల్లి పృథ్వి, లంక పల్లి విశ్వనాథ్,మహిళా నాయకులు ప్రియాంక తదితరులు ఉన్నారు.

# సింగరేణి ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే కూనంనేని భేటీ





- సంస్థ సిఎండి, డైరెక్టర్ పాతో నియోజకవర్గ అభివృద్ధిపై సుదీర్ఘ చేర్చ.
- బస్టాండ్ నిర్మాణం, సిఎస్ఆర్ నిధులు, షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణంకు సహకరించండి.
- ప్రతిపాదనలపై సానుకూల స్పందన లభించింది -ఎమ్మెల్యే కూనంనేని.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం సింగరేణి / జులై 28/అక్షరం న్యూస్ – : సింగరేణి ఉన్నతాధికారులతో కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సోమావారం సంస్థ ప్రధానకార్యాలయం, కొత్తగూడెంలో భేటీ అయ్యారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం, డైరెక్టర్ (పా) గౌతంతో కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై సుదీర్ఘంగా చేర్చించారు. సింగరేణి సంస్థ నిర్వహణలో కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్ త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరారు. సిఎస్ఆర్ నిధులు పెద్దమొత్తంలో కేటాయించి నియోజకవర్గ పరిధిలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని , జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం బస్టాండ్ పుననిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. కొత్తగూడెం ప్రధాన సింగరేణి వైద్యశాలను కార్పొరేట్ స్థాయి వైద్యశాలగా అభివృద్ధి చేయాలనీ, వైద్యుల కొరతను నివారించడంతోపాటు నిపుణులైన వైద్యులను నియమించాలని సూచించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, వారు నివసించే క్వార్టర్లలో సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు లీజులో ఉన్న స్థలాలను కేటాయించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అందేలా చెర్యలు తీసుకోవాలని, నిబంధనప్రకారం వారికి సౌకర్యాలు కల్పించేందుకు తగిన ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై సంస్థ ఉన్నతాధికారులతో చేర్చలు జరిపామని ప్రధానంగా సిఎస్ఆర్ నిధులు, నూతన బస్టాండు నిర్మాణం, కూరగాయల మార్కెట్ సమీపంలోని సంస్థ కాంప్లెక్ నిర్మాణం, సంస్థ కార్మికుల సంక్షేయం, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చేర్చించామని, అధికారులు సానుకూలంగా స్పందించారని కూనంనేని తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, రమణమూర్తి తదితరులు వున్నారు.

## ఇసుక లారీలు వల్ల ధ్వంసం అయిన రోడ్లను మరమ్మత్తులు చేయాలి..

- ఇసుక రీచ్ యజమానులతో లాలూచీ పడుతున్న అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు..
- తక్షణమే ఇసుక లారీలను నిలుపుదల చేయాలి.
- ఇసుక లారీల ప్రమాదాల నుండి ప్రజలను కాపాడాలి
- సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో



భద్రాద్రి కొత్తగూడెం /భద్రాచలం /జులై 28 /అక్షరం న్యూస్ : ఇసుక లారీలువల్ల ధ్వంసమైన రోడ్లను మరమ్మతులు చేయాలని, అధికార ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు ఇసుక రీచ్ యజమానులతో లాలూచీ పడుతూ భద్రాచలం నియోజకవర్గం అభివృద్ధిని తుంగలో తొక్కుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, కారం పుల్లయ్య లు అన్నారు. సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇసుక లారీల వల్ల ధ్వంసం అవుతున్న రోడ్లు మరమ్మత్తులు చేయాలని, నియోజవర్గంలోని ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వీడాలని కోరుతూ భద్రాచలం బ్రిడ్జి సెంటర్లో రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గం లో దుమ్ముగూడెం, చర్ల,వెంకటాపురం మండలాల్లో అధికార,ప్రతిపక్ష పార్టీల నేతల అండ దండలతో నిర్వహిస్తున్న ఇసుకరీచుల కారణంగా నియోజకవర్గంలోని రోడ్లు మొత్తం ధ్వంసం అవుతున్నాయని ఈ సమస్య పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. అనేకమార్లు స్థానిక ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడంలేదని అన్నారు. ఇసుక లారీలు వందల సంఖ్యలో ప్రయాణం చేయడం వల్ల రోడ్లపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. తక్షణమే ప్రభుత్వం రోడ్లు మరమ్మత్తులు చేయడం కోసం నిధులు కేటాయించి రోడ్లు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుకరీచుల కారణంగా దెబ్బతింటున్న నియోజకవర్గం అభివృద్ధి పట్ల అధికార ప్రతిపక్ష నాయకులు కళ్ళు తెరవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు పి సంతోష్ కుమార్ డి సీత లక్ష్మి పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి అజయ్ కుమార్ భూపేంద్ర యు జ్యోతి, బి కుసుమ, ఎస్ డి ఫిరోజ్, నకరికంటి నాగరాజు, డి రాఘవయ్య,కనక శ్రీ,కుంజ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు...

# పరలోక ప్రార్థన,కేసముద్రం పాస్టర్స్,లీడర్స్ కమిటీ ఎన్నిక

## పరలోక ప్రార్థన కమిటీ చైర్మన్

### గా,జాన్ మహబూబ్ అధ్యక్షులుగా బని శెట్టి వెంకటేష్



మహబూబాబాద్ /కేసముద్రం /జూలై 28/అక్షరం న్యూస్ :-కేసముద్రం మండలంలో నూతనముగా ఏర్పడ్డ మున్సిపాలిటీ లో కేసముద్రం మండల పాస్టర్స్ నూతన కమిటీని బిలీవర్స్ చర్చిలో ఏర్పాటు చేసుకోవడం జరిగింది.ఈ కమిటీ పరలోక ప్రార్థన సహవాస సేవకుల లీడర్స్ కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ కమిటీకి చైర్మేన్ గా జాన్ మహబూబ్ కాగా అధ్యక్షులుగా బనిశెట్టి వెంకటేష్,ఉపాధ్యక్షులుగా పుల్లెంల శ్రీధర్,ప్రధాన కార్యదర్శిగా డి లాల్ సింగ్, సహాయ కార్యదర్శిగా,వి జోసెఫ్,కోశాధికారిగా టి జాన్ వెస్లీ,సలహాదారులుగా,ఈ డేవిడ్ రాజ్,బి విక్టర్ పాల్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ కమిటీ ప్రపంచ శాంతి కొరకు దేశ రాష్ట్రాల రాజుల అధికారుల ప్రజల క్షేమం కొరకు దేవునికి ప్రార్థన చేస్తూ,నిరుపేద,బడుగు,బలహీన,వర్గాల ప్రజలకు సహాయక సేవలతో పాటు, విద్య,వైద్యం,వస్త్ర దానాలతో పాటు, రక్తదాన శిబిరాలతో ప్రజలకు సహాయ కార్యక్రమాలు చేపడుతుందని, కమిటీ వారు తెలిపారు.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితని మర్యాదపూర్వకంగా కలిసిన తరుణ్ నాయక్



**మహబూబాబాద్ /కేసముద్రం /జులై 28/అక్షరం న్యూస్:**
-ఇటీవలే కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో టార్గెట్ చేసి ఇంటి పైన రాత్రి 2 గంటలకు దాడికి వచ్చిన విషయం ఎమ్మెల్సీ కవిత ని వివరించిన తరుణ్ నాయక్.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని కేసులు పెట్టి బెదిరించిన భయపడద్దని వచ్చేసారి మన ప్రభుత్వమే వస్తుందని అప్పుడు వడ్డీతో సహా రిటన్ గిఫ్ట్ మనం చేద్దామని మళ్ళీ నువ్వు ధైర్యంగా ఉండ మాన్ని హామీ ఇచ్చారు.యువత రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలి,స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేయాలి అన్ని సూచించారు. 2028 లో మళ్లీ కెసిఆర్ ని ముఖ్యమంత్రిగా చూడడమే మన లక్ష్యం కావాలి అని సూచించారు.అలాగే తరుణ్ నాయక్ ను తన అనుభవాలను విలువైన సూచనలను తెలియజేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే యువతకు ఎల్లప్పుడూ తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తరుణ్ నాయక్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం నిత్యం పనిచేసే యువతకు అవకాశం కల్పించి గెలిపించాలని ఎమ్మెల్సీ కవిత ని కోరారు.

# ఆకస్మికంగా మోడల్ స్కూల్,హాస్టల్ తనిఖీ చేసిన గంట



**మహబూబాబాద్/కేసముద్రం /జూలై 28/అక్షరం న్యూస్**
:-కల్వల గ్రామంలోని మోడల్ స్కూల్,మరియు హాస్టల్ ఆకస్మికంగా కేసముద్రం వ్యవసాయ కమిటీ మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి తనిఖీ చేశారు.మొదట మోడల్ స్కూల్ మధ్యాహ్నం భోజనం పరిశీలించి విద్యార్థుల నుండి తగు సమాచారాన్ని సేకరించి అనంతరం అమ్మాయిల హాస్టల్ భోజనం తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు విద్యార్థు సమస్యలపై విన్నవించారు సానుకూలంగా స్పందించి త్వరలో మీకు అన్ని వసతులు అందుబాటులోకి తీసుకు వస్తాను అని విద్యార్థులకు తెలియజేశారు త్వరలో బోజనశాల షెడ్డు కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులందరూ సమయపాలన తప్పకుండా పాటించాలి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పరిమి నవీన్.పార్టీ నాయకులు అల్లం నాగేశ్వరరావు బండారి దయాకర్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

### ...డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, డాక్టర్. బి.రవీంద్ర నాయక్

### ... జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షా

**పెద్దపల్లి ప్రతినిధి జులై 28 అక్షరం న్యూస్**
సీజనల్ వ్యాధుల నివారణకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ తీసుకున్న సంసిద్ధతను పరిశీలించడానికి పెద్దపల్లి జిల్లాలో సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి మరియు ప్రోగ్రాం అధికారులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకున్న సంసిద్ధత కార్యక్రమంల పై సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గర్రేపల్లి ని సందర్శించారు. అక్కడి సేవలను, వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది ని ఉద్దేశించి థియరీ జ్ఞానం వుంటే సరిపోదు ప్రాక్టికల్ జ్ఞానంను పెంపొందించు కోవాలి అని అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం, సుల్తానాబాద్ ను సందర్శించి అక్కడి డాక్టరు మరియు సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అదేవిధంగా విజయ హాస్పటల్, పెద్దపల్లిని తనఖీ నిర్వహించారు. హాస్పటల్ యాజమాన్యంతో మాట్లాడుతూ టారిఫ్ బోర్డు ప్రకారం చికిత్సకు ఫీజులను తీసుకోవాలి అని అన్నారు. ఫీజు వివరాలను ముందే తెలియజేయాలి అని అన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టం ప్రకారం మినిమమ్ స్టాండర్డ్స్ పాటించాలి అని అన్నారు. ఫైర్ సేఫ్టీ మెజర్స్ తీసుకోవాలి, దాని ద్వారా రోగులతో పాటు, డాక్టర్ మరియు సిబ్బందికి కూడా రక్షణ ఉంటుంది అని అన్నారు.ఈ



కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి, డాక్టర్ జి అన్నా ప్రసన్న కుమారి గారు, ప్రోగ్రామ్ అధికారులు డా.రాజమౌళి, డా. వాణి శ్రీ, డా. సుధాకర్ రెడ్డి, డా. కిరణ్ కుమార్ గారు పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటమర్తి శ్రీనివాస్

### 38 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణానికి దక్కిన గౌరవం

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా /బూర్గంపాడు మండలం /సారపాక.



**అక్షరం న్యూస్ /జులై 28:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం, సారపాక గ్రామానికి చెందిన కామ్రేడ్ కోటమర్తి శ్రీనువాస్ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగింది. మన మండలానికి ఎంతో గర్వించదగ్గ వ్యక్తి కోటమర్తి శ్రీనివాస్. మొదటిగా విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ పాల్వంచ టౌన్ కార్యదర్శి గా చేస్తూ తనదైన శైలిలో ప్రజలకు సేవ చేయడం మొదలుపెట్టారు. ఆ విధం గా మొదలైన అతని ప్రయాణం కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘాలలో పనిచేస్తూ 38 సంవత్సరాల సుదీర్ఘ సేవలు అందిస్తూ ప్రజలను నిత్యం చైతన్య వంతులని చేసినటువంటి కామ్రేడ్ కోటమర్తి శీనువాస్ .స్వతహాగా కళాకారుడైన కోటమర్తి తనదైన శైలిలో ప్రజలను చైతన్య గీతాలు పాడుతూ ఎన్నో జిల్లాస్థాయి ప్రథమ బహుమతులు గేలుచుకున్న అనుభవం ఉంది. జానపదం ,పల్లె పదం, గ్రామాలలో ఉన్న మూఢనమ్మకాలను పారదోలుతూ పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని మరియు రోడ్డు భద్రత సూచనలు పాటించాలని అనేక భద్రత గేయాలు పాడి ప్రజలను చైతన్య వంతులుగా మార్చిన ప్రజా గాయకుడు కామ్రేడ్ కోటమర్తి శ్రీనివాస్. సామాన్య ప్రజల శ్రేయస్సు కోసం అనునిత్యం చైతన్యవంతులను చేస్తూ నిరంతరం వారి అభివృద్ధికి కృషి చేసిన కోటమర్తి శ్రీనివాస్ కి ఈ గౌరవం పొందిన సందర్భంగా ప్రజలు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చెత్తను రీసైక్లింగ్ చేసి పర్యావరణం కాపాడాలి.. డిప్యూటీ కమిషనర్





**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**
చెత్తను రీ సైకిలింగ్ చేసి పర్యావరణం పై దుష్ప్రభావం తగ్గించాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి అన్నారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సోమవారం గౌతమి నగర్ లోని డి ఆర్ సి సి కేంద్రం , క%శీ%పోస్ట్ యార్డ్ లలో "వేస్ట్ ఆడిట్ "నిర్వహించారు. ఈ సంధర్భంగా జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ చెత్తతో సంపద సృష్టించడానికి అపార అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఆ అవకా శాలను సద్వినియోగం చేసుకోవడానికి పొడి చెత్త , తడి చెత్త వేర్వేరుగా సేకరించి రీ సైకిలింగ్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కాగా ఆయన అంతకుముందు 7 బి కాలనీ విట్టల్ నగర్ లో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ గుర్తించి శుభ్రం చేసి ముగ్గులు వేసి అక్కడ చెత్త పడ వేయవద్దని చుట్టు ప్రక్కల వారికి అవగాహన కల్పించారు. చెత్త డంప్ యార్డ్ సందర్శించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , మెప్మా సి ఓ శ్వేత ,ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ , వార్డు అధికారులు , సానిటరీ జవాన్లు ఆర్ పి లు , స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.



# పర్యావరణ ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత

### - లయన్స్ క్లబ్ సభ్యులు -రామగిరి ఖిల్లా పై విత్తనపు బంతులు

**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూలై 28 అక్షరం న్యూస్:**



పర్యావరణ ప్రకృతి పరిరక్షణ మన అందరి బాధ్యతని రామగిరి మండల లైన్స్ క్లబ్ సభ్యులు గంట వెంకటరమణారెడ్డి, మీకు అలా మారుతి అన్నారు. సోమవారం పర్యావరణాన్ని,సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవశ్యకత గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జూలై 28న ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం గా జరుపుకోవడం జరుగుతుంది అందులో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో రామగిరి ఖిల్లా గుట్ట ప్రాంతంలో దాదాపు 500 విత్తనము బంతులను విసిరివేయడం జరిగింది. విత్తనము బంతుల్లో అల్ల నేరడి, సీతాఫలం,వేప,నిమ్మ వంటి పండ్లు మరియు కూరగాయల విత్తనాలతో కూడిన మట్టితో బంతులు తయారు చేయడం జరిగింది.అనంతరం లయన్స్ క్లబ్ డైరెక్టర్ మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి,మేకల మారుతి మాట్లాడుతూ శ్రావణ మాసంలో రామగిరి ఖిల్లా వీక్షణకు వచ్చేవారు కూడా విత్తనపు బంతులు వేయాలని కోరుతున్నాము అలా చేయడం వల్ల మూగ జీవాలకు ఆహారం దొరుకుతుంది. విశ్వంలో జీవరాశుల మనుగడకు మూలాధారం అయిన భూమి, గాలి, నీరు, నింగి, నిప్పు, నేల అనే పంచభూతాలను ప్రకృతే ఈ విశ్వానికి అందించిందని వారిని విధ్వంసం చేయడం వల్ల మానవాళి పలు విపత్తులకు గురవుతుంది. మానవుడు ఉన్నన్ని రోజులు ప్రకృతి వనరులను ఉపయోగించుకోవాలి తర్వాత తరానికి అందించాలి ప్రకృతి వనరులు తరతరాల వారసత్వ సంపద కాబట్టి వాటిని భావి తరాల కోసం రక్షించాలి. భారతదేశములో ప్రకృతిని దేవతగా ఆరాధించే సంస్కృతి వుందన్న చారిత్రిక సత్యాన్ని మరువకూడదు. విచక్షణ రహితంగా అటవీ సంపదను విద్వంసం చేయటం వల్ల ప్రకృతి విపత్తులు అకాల వర్షాలు వరదలు వచ్చి అపారమైన ఆస్తినష్టం, ప్రాణ నష్టం సంభవిస్తుంది ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కొరకు మనందరం ఐక్యమై ఉద్యమించాలి. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. పర్యావరణ ప్రకృతి పరిరక్షణకు '3ఆర్' పద్ధతిలో తగ్గించడం (రెడ్యూ స్ ) తిరిగి వాడటం (రీయూజ్) పునరుద్ధరణ (రీసైక్లింగ్)వంటి పద్దతులు మనిషి జీవితములో బాగం కావాలి అలాగే అడవుల పెంపకం పెద్ద ఎత్తున చేపట్టాలి. ప్రకృతి పర్యావరణ హితకరమైన చర్యలు చేపట్టాలి.ప్రకృతి రక్షణే మానవాళి రక్షణ అన్నది ఒక నినాదం కాకుండా ప్రజల జీవన విధానం కావాలి. భావితరానికి స్వచ్ఛమైన ప్రకృతిని బహుమతిగా ఇద్దాం. ప్రకృతి రక్షణ మనందరి కోసం భావితరాల కోసం మనిషి మనుగడ కోసం. స్వచ్ఛభారత్ నిర్మాణానికి పునరంకితమౌదామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మొల్మురి శ్రీనివాస్,సభ్యులు తీగల శ్రీధర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# 90 లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**పేదల కళ్ళల్లో ఆనందం చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానం**

**10 ఏళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ఇల్లు రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను వంచించింది**

**నా ప్రజల కోసం 18 గంటలు ప్రజల కోసమే పనిచేస్తున్నా**

**పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు**



**పెద్దపల్లి రూరల్ జూలై 28 అక్షరం న్యూస్**

పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట ముత్తారం గ్రామాల్లో సోమవారం రోజున 90 లక్షల రూపాయల నిధులతో పలు డ్రైనేజిలు సిసి రోడ్లకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు మరియు ముత్తారం గ్రామంలో మహిళా సంఘం భవనాన్ని ప్రారంభోత్సవం చేసి అలాగే గౌరెడ్డిపేట, ముత్తారం గ్రామాలకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను స్థానిక నాయకులతో కలిసి అందించారు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు లక్షల రూపాయల రుణమాఫీ తిరిగి రుణ సదుపాయం, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంటు, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం, రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సదుపాయానికి రూ. 10 లక్షలకు పెంపు, కటింగులు లేకుండా వడ్ల కొనుగోల్లు, సన్న వడ్లకు రూ. 500ల చొప్పున బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి ఎమ్మెల్యే విజయరమణ రావు అందజేస్తున్నట్టు తెలిపారు సంవత్సరంన్నర కాలంలోనే ఇన్ని సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అలాగే గ్రామాల్లో అనేక అభివృద్ధి పథకాలను రోడ్లు, డ్రైనేజీలు రవాణా వంటి మౌలిక సదుపాయాలను చేపట్టడం జరుగుతుందన్నారు తాను కూడా 24 గంటల్లో 18 గంటలు ప్రజల కోసం నిర్విరామంగా పనిచేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను ఎన్నుకుంటే అభివృద్ధి సంక్షేమ పథకాలను మరింత ముందుకు తీసుకువెళ్లే వీలుంటుందన్నారు.

కాంగ్రెస్ పార్టీ నిలబెట్టే అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు మరియు ఎంపీడీఓ శ్రీనివాస్ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప సింగిల్ విండో నర్సింహా రెడ్డి నుగిళ్ల మల్లన్న సయ్యద్ మస్రత్ సందనవేణి రాజేందర్, కలవేణి మహేందర్, ఏడల్లి శెంకర్, ముత్యాల నరేష్, ఆర్మ్యాటీ సంతోష్,కదర్ల శ్రీనివాస్, కట్కూరి సుధాకర్ రెడ్డి, కొమ్ము శ్రీనివాస్, పోల్సని మల్లేష్, కొమ్ము కర్ణాకర్, కొమ్ము అభిలాష్,చిట్టావేన మోహన్ నల్లగొండ కుమార్ గుర్రం రమేష్, ఏద్దు కుమార్, కోట శరత్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఐటీ బాసరలో సీటు సంపాదించిన విద్యార్థికి సన్మానం



**మహబూబాబాద్ /కేసముద్రం /జూలై 28/అక్షరం న్యూస్ :-**

త్రిబుల్ ఐటీ బాసరలో సీట్ సంపాదించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెనుగొండ విద్యార్థులు స్నేహ చాంద్ సలాం లను వారి తల్లిదండ్రులను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పురప్రముఖులు,ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కాలేరు యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వాలు అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.మాజీ ఎంపీటీసీ వెంకన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తుందని దానికి ఉదాహరణ ఐఐటి బాసరలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చదివే అవకాశం రావటం అని అన్నారు. పురప్రముఖులు కట్టయ్య, వీరస్వామిలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నిపుణులైన,నిష్ణాతులు అయిన ఉపాధ్యాయులు ఉన్నారని ప్రజలందరూ తమ పిల్లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అంజయ్య, భాస్కర్, గురునాధరావు, హుస్సేన్, వెంకటగిరి, భీముడు,శ్రీనివాస రావు, మల్లేశం,కిషన్,వీరేందర్, భాగ్యలక్ష్మి,విజయచందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ తండాలో తీజ్ పండుగ సందర్భంగా మహిళా మణులకు సొంత ఖర్చుతో చీరలు పంపిణీ.



**మహబూబాబాద్ /కేసముద్రం /జూలై 28/అక్షరం న్యూస్ :-**కేసముద్రం ద మున్సిపాలిటీ పరిధిలోని సబ్ స్టేషన్ తండ (ఎస్టి కాలనీ)లో ఈనెల 31 వ తేదీన జరగబోయే గిరిజనుల తీజ్ పండుగను పురస్కరించుకొని మహిళా మణులకు కేసముద్రం మండల యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాదావత్ పవన్ కళ్యాణ్ నాయక్ మహిళలందరికీ సోమవారం చీరలు కానుకగా అందజేశారు. తీజ్ పండుగ సందర్భంగా ప్రతి ఒక్క మహిళ కొత్త చీరను ధరించాలని ఉద్దేశంతో దాదాపు 280 చీరలను తన సొంత ఖర్చుతో అందజేసినట్లు తెలిపారు. ఈ తీజ్ పండుగకు ముఖ్యఅతిథిగా మహబూబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ హాజరవుతారని తెలిపారు.

## ఆధునిక మెలకువలతో బోధనా ప్రక్రియలో రాణించాలి

**త్రినిటీ వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి**

**త్రినిటీ డిఎడ్ విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాం**




**పెద్దపల్లి టౌన్ జూలై 28 అక్షరం న్యూస్**

సామాజిక మార్పును పరిగణలోకి తీసుకొని ఆధునిక మెలకువలతో బోధనలో రాణించాలని విద్యాసంస్థల వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు పెద్దపల్లి త్రినిటీ డిఎడ్ కళాశాలలో సోమవారం జరిగిన బిఎడ్ విద్యార్థుల ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రారంభ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి పలు విషయాలు మాట్లాడారు కళాశాలకు రెగ్యులర్గా హాజరవుతూ విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక ప్రక్రియలను నైపుణ్యాలను వెలికితీస్తూ వృత్తినిబద్ధతతో భావి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా త్రినిటీ ఉపాధ్యాయ శిక్షణ కళాశాల తీర్చిదిద్దుతుందని దానికి పేరెంట్స్ కూడా సహకరించాలని ఈ సందర్భంగా కోరారు వృత్తిని భద్రత మాత్రమే కాకుండా ఎన్నో రిఫరెన్స్ పుస్తకాలను అధ్యయనం చేస్తూ ప్రతిరోజు లైబ్రరీని వినియోగించుకుంటూ ఒక గుణాత్మకమైన విద్యను అందించే దిశలో నిరంతరము తపనతో బోధన మెలకువలను ఉనికిపుచ్చుకోవాలని విద్యార్థులను కోరారు ఈ వేగవంతమైన జీవితంలో కరికులంతో పాటు సాంకేతిక అంశాలలో కూడా అత్యంత పరిజ్ఞానం అలవర్చుకోవాలని అన్నారు ఈ సందర్భంగా విద్యార్థులు పరిచయ కార్యక్రమంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో త్రినిటీ డిఎడ్ బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ లు రెడ్డమ్మ రజని బుర్ర తిరుపతి జైపాల్ హరి తదితరులతోపాటు అధ్యాపకులు దిలీప్ శర్మ మధుకర్ పి.తిరుపతి రమేష్ అనురాధ సుజాత జ్యోతి శారద తదితరులు పాల్గొన్నారు

## అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి

**.... అదనపు కలెక్టర్ డి.వేణు**



**పెద్దపల్లి ప్రతినిధి, జూలై 28 అక్షరం న్యూస్**

అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని లిఅదనపు కలెక్టర్ డి.వేణులి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా లిఅదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. గోదావరిఖని ఎన్టీఆర్ నగర్ కు చెందిన సామాజిక కార్యకర్త బి. వంశీ కృష్ణ గోదావరిఖనిలో గల్లీకి ఒక్క బెల్టు షాపు కొనసాగుతుందని, ఆర్టిఐ లో తనకు తప్పుడు సమాచారం అందించారని, మున్సిపల్ కార్పొరేషన్ పర్యాటక కేంద్రాలు పర్మిట్ రూమ్ లు ఉండకూడదు అనే ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా రామగుండం కార్పొరేషన్ పెద్దపల్లి మంథని సుల్తానాబాద్ మున్సిపాలిటీలో వైన్ షాపులకు అనుబంధంగా భారీ విస్తీర్ణంలో పర్మిట్ రూములు ఏర్పాటు చేశారని, బెల్ట్ షాప్ లోను నిర్మూలించడంతోపాటు తప్పుడు సమాచారం అందించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా అభ్కారి శాఖ అధికారి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.రామగుండం నగరం ఇందిరానగర్ కు చెందిన కల్లూరు వెంకటి తనకు తన ఇద్దరు ఆడపిల్లలు పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి ఆర్డీవో కు రాస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పెద్దపల్లి పట్టణానికి చెందిన బృందావన్ కాలనీ వాసులు తమ నివాసాల సమీపంలో ఉన్న రైస్ మిల్స్ బూడిద దుర్వాసన వెదజల్లే పొగను వ్యర్థ జలాలను నిర్లక్ష్యంగా విడుదల చేస్తున్నాయని, దీనివల్ల బృందావన్ కాలనీలో నివసించే ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, తమ సమస్యకు పరిష్కారం చూపాలని కొరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి ఆర్డీవో కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం, పెద్దపల్లి చే జారీ చేయనైనది

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలి

**– జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణఅధికారి కాసర్ల నరేందర్**



**రామగిరి (పెద్దపల్లి జిల్లా) జూలై 28 అక్షరం న్యూస్:**

రామగిరి మండలం లో ఇందిరమ్మ ఇండ్ల సర్వే వివరములు వెంటనే నమోదు పూర్తి చేయాలని పెద్దపలి జిల్లా ముఖ్యకార్యనిర్వాహణ అధికారి కాసర్ల నరేందర్ అన్నారు. సోమవారం రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పూర్తి చేసి ఓటర్ లిస్ట్ మెర్జింగ్ వెంటనే పూర్తి చేయుటకు ,పై ఆన్లైన్ లో చేయవలసిన డేటా ఎంట్రీ గురించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బద్రి శైలజ రాణి, ఎంపీ ఓ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల పైన చెత్త వేస్తే జరిమానా తప్పవు

**– మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్**

**పెద్దపల్లి టౌన్ జూలై 28 అక్షరం న్యూస్**

పెద్దపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ ఎల్లమ్మ చెరువు పైన చెత్త వేసినందుకు గాను పెద్దపల్లి పట్టణానికి చెందిన వ్యాపారికి 11.000 రూపాయల జరిమాన విధించడం జరిగింది ఈసందర్భంగా కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ ప్రజలు మరియు వ్యాపారస్థులు రోడ్లపైన డ్రైనేజీలో గాని ఎస్సారెస్పీ కాలువల వెంబడి ఎల్లమ్మ చెరువులో వెయ్యవద్దని అదే విధంగా రాత్రి వేళ బైకుల పైన చెత్తను తీసుకవచ్చి రోడ్ల పైన వెయ్యడం జరుగుతుంది అని అలా వేస్తే వారిని గుర్తించి జరిమానాలు విధించడం జరుగుతుందని అన్నారు పట్టణ ప్రజలు వ్యాపారస్తులు మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి చెత్తను అందించి పెద్దపల్లి పట్టణాన్ని స్వచ్ఛ పెద్దపల్లిగా తీర్చిదిద్దే క్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్,జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్,ప్రదీప్ పాల్గొన్నారు.



# అమ్మ కళ్ళు సజీవం..!

**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్**

వృద్ధాప్యంలో వచ్చిన అనారోగ్య సమస్యలతో ఓ 86 ఏళ్ల వృద్ధురాలు మృతి చెందగా, ఆమె నేత్రాలతో మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చని.. కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు నూక రమేష్ అవగాహన కల్పించారు.

వృద్ధురాలి నేత్రాలను దానం చేసి ఆదర్శంగా నిలిచారు.

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ లోని గాంధీ నగర్ కు చెందిన భీమవరపు సుందరమ్మ (86) అనే వృద్ధురాలు వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో సోమవారం వారి ఇంట్లో మృతి చెందింది. మృతురాలి భర్త మురహరి రావు ఫ్రీడమ్ ఫైటర్. మృతురాలి నేత్రాలను దానం చేస్తే.. ఇద్దరికి చూపు వస్తుందని, కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు నూక రమేష్ అవగాహన కల్పించి ఒప్పించారు. స్పందించిన మృతురాలి కొడుకులు, కోడళ్ళు శ్రీనివాస్ - విజయలక్ష్మి, రామకృష్ణ, కూతుళ్లు, అల్లుళ్లు శ్రీదేవి, రుక్మిణి, మహాలక్ష్మి - గోపాలకృష్ణ, జ్యోతి - హన్మంతు అంగీకారం తెలిపారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతురాలి కార్నియాలను సేకరించి హైదరాబాదుకు



తరలించారు. ఈ సందర్భంగా నేత్రదాతకు ఘనంగా నివాళులర్పించారు. విషాదంలో కూడా మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించడానికి తల్లి కార్నియాలను దానం చేయడానికి అంగీకారం తెలిపిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ముఖ్య సలహాదారులు నూక రమేష్, కార్యదర్శి భీష్మాచారి, ప్రచార కార్యదర్శి కే ఎస్ వాసు తదితరులు అభినందించారు. సుందరమ్మ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

## గ్రామాల ప్రజలకు వైద్య సౌకర్యాలు అన్ని రకాల మందులు, పరీక్షలు అందుబాటులో ఉండాలి

**జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 28 పెద్దపల్లి జిల్లా అక్షర న్యూస్**

ప్రగతిశీల యువజన సంఘం (పీ వై ఎల్) పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని , వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని అన్ని రకాల మందులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి లిప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాస్పేట ధర్మేందర్ ఆరు ముళ్ళ తిరుపతిలి లు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రిల దోపిడి రోజు రోజుకు రెట్టింపు అవుతుందనీ ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటల్స్ అక్రమ సంపాదనే లక్ష్యంగా గ్రామాలలో తమ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నాయన్నారు. ప్రైవేటు దోపిడీని అరికట్టే విధంగా తగిన చర్యలు చేపట్టాలనీ ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ వైద్యం ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలనీ డాక్టర్లను ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలనీ. ప్రభుత్వ వైద్య వ్యవస్థను పటిష్ట పరచాలనీ. ప్రభుత్వ వైద్యశాలలలో సౌకర్యాలను మెరుగుపరచాలనీ అన్ని రకాల మందులను, అన్ని రకాల పరీక్షలను నిత్యం అందుబాటులో ఉంచి పేద ప్రజలకు వైద్య సౌకర్యాలు అందించాలన్నారు.

వర్షాల కారణంగా గ్రామాలలో ప్రబాలుతున్న విష జ్వరాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారనీ.




గ్రామాల ప్రజలకు వైద్య సౌకర్యాలు, అన్ని రకాల మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచి వైద్య సౌకర్యాలు అందించాలనీ అందుకు ప్రభుత్వం గ్రామాల ప్రజలను అనారోగ్యాల బారి నుండి కాపాడాలని విజ్ఞప్తి.

ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు బొంతు ఆనంద్, తిర్రి బాలకృష్ణ , ఈదునూరి బాబు, నల్ల తీగల రమేష్ ,ప్రేమ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

# బులియన్‌లో పెట్టుబడులు





ఉన్న లాభాలేంటి?.. అనుసరించాల్సిన వ్యూహాలేంటి?

నేటి ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులకు ఎన్నో మార్గాలున్నాయి. స్టాక్స్, బాండ్ల దగ్గర్నుంచి రియల్ ఎస్టేట్, మ్యూచువల్ ఫండ్ల వరకు మదుపునకు బోలెడు అవకాశాలు. తద్వారా ఒకప్పటితో పోల్చితే మనకున్న ఆదాయాన్ని అనేక రెట్లు పెంచుకోగలుగుతున్నాం కూడా. అయితే వీటన్నిటిలో బంగారంపై పెట్టుబడి అనేది ఎప్పటికీ ఎవర్‌గ్రీన్ అనే చెప్పాలి. ఇదో సురక్షిత, స్థిరమైన పెట్టుబడి కావడమే ఇందుకు కారణం. ఇక గోల్డ్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనేక రూపాల్లో ఉంటాయి. ఆభరణాలు, డిజిటల్ గోల్డ్, సావరిన్ బాండ్లు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లు ఇలా రకరకాలున్నాయి. అయినప్పటికీ భౌతిక రూపంలో బంగారపు కడ్డీలు, నాణేల్లో పెట్టుబడే అత్యంత సురక్షితం. అంతేగాక తెలివైన, చక్కని ఆలోచన.గోల్డ్, బులియన్‌కు మధ్య ప్రధాన తేడా దాని రూపం, స్వచ్ఛత, పెట్టుబడి కోణాలే. సాధారణంగా బులియన్.. బంగారు కడ్డీలు, నాణేల రూపంలో ఉంటుంది. అత్యంత స్వచ్ఛత, అత్యధిక విలువ దీని సొంతం. ఇక కడ్డీలు, నాణేల్లో గోల్డ్ లభించినా..

నగలు, బాండ్లు ఇతరత్రా రూపాల్లోనూ ఉంటుంది. స్వచ్ఛత, విలువల్లో వ్యత్యాసాలుంటాయి. అయితే బులియన్‌లోనే ఎందుకు మదుపు చేయాలంటే?..

భద్రత-స్థిరత్వం.. బులియన్ అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇతర రూపాల్లో కంటే ఇందులో బంగారం విలువ స్థిరంగా ఉంటుంది. పైగా ద్రవ్యోల్బణం, ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో మరింత లాభదాయకంగా నిలుస్తుంది. ఈ క్రమంలోనే కచ్చితమైన రాబడులకు వీలుంటుంది.


నగదీకరణ..

మనకు అవసరమైతే, ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడైనా నగదుగా మార్చుకోవడానికి అత్యంత సౌకర్యవంతంగా ఈ పుత్తడి ఉంటుంది. స్వచ్ఛత, విలువపరంగా ఎంతమాత్రం వేచిచూడాల్సిన పనిలేదు. రియల్ ఎస్టేట్, ఇతర బాండ్లలో, నగల్లో ఈ అవకాశాలు తక్కువ.అవగాహన అక్కర్లేదు..బులియన్‌లో పెట్టుబడికి మార్కెట్ పరిజ్ఞానంతో పనిలేదు. స్టాక్ లేదా బాండ్ మార్కెట్లలో మార్కెట్ అవగాహన మదుపరులకు ఉండాల్సిందే. దీంతో కొత్తగా పెట్టుబడుల్లోకి వచ్చేవారు బులియన్ మార్కెట్‌ను వేదికగా ఎంచుకోవచ్చు.సంస్కృతి..భారతీయుల సంస్కృతిలో బంగారం కూడా ఒక భాగమే. అందుకే చాలామంది పుత్తడిని ఓ విలువైన లోహంగానో, పెట్టుబడిగానో చూడటం కంటే దాన్ని ఓ సెంటిమెంట్‌గా భావిస్తారు. అందులో దైవత్వాన్నీ చూస్తారు. ఇదికూడా దేశీయ మార్కెట్‌లో పసిడికి వన్నె తగ్గకుండా చేస్తున్నది.పెట్టుబడికి వ్యూహాలు..ప్రతీ పెట్టుబడిలోనూ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే మరింత రాబడులను ఒడిసి పట్టుకోవచ్చు. బంగారం విషయంలోనూ ఇంతే. అందుకున్న మార్గాలను పరిశీలిస్తే..చిన్నచిన్నగా.. చిన్నచిన్నగా పెట్టుబడులు పెట్టడం.. ఓ ప్రభావవంతమైన వ్యూహం అని చెప్పవచ్చు. మార్కెట్ పరిస్థితులనుబట్టి క్రమేణా మన పెట్టుబడులను పెంచుతూపోవాలి. దీనివల్ల ఆకస్మిక నష్టాలను అధిగమించవచ్చు.నాణేలు, కడ్డీల్లో... మొదట్లో నాణేలపై పెట్టుబడులు పెట్టవచ్చు. ఈ ట్రేడింగ్ సులభంగా ఉంటుంది. ఆ తర్వాత పెద్దపెద్ద కడ్డీలవైపు వెళ్లాలి. ఈ మార్పు.. అమ్మకాలు, మీ పసిడి ఆస్తుల నిర్వహణను రక్షణాత్మకంగా మార్చగలదు.

మార్కెట్ ట్రెండ్స్..ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌నుబట్టి నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమం. గోల్డ్ మార్కెట్‌నూ అనేక అంశాలు ప్రభావితం చేస్తూంటాయి. ద్రవ్యోల్బణం, భౌగోళిక-రాజకీయ అనిశ్చితులు కీలకం. కాబట్టి ఇతర మార్కెట్లు క్షీణిస్తుంటే.. గోల్డ్‌కు డిమాండ్ ఉంటుందని గుడ్డిగా అనుసరించకూడదు. పరిస్థితులనుబట్టి పెట్టుబడుల కోసం ముందుకెళ్లాలి.నిల్వ..

భౌతిక బంగారంపై పెట్టుబడులు పెడుతున్నప్పుడు బ్యాంక్ లాకర్లు లేదా ప్రొఫెషనల్ వాల్ట్ సర్వీసులను మీ బులియన్ నిల్వల కోసం ఎంచుకోవడం ఉత్తమమని మరువద్దు.పన్నులు..దేశీయంగా పసిడి క్రయవిక్రయాలు చేసేటప్పుడు పన్నులను చూసుకోవాలి. అప్పుడప్పుడు పన్నులు ఎక్కువగా ఉంటుంటాయి. దీనివల్ల వచ్చే లాభాలు పన్ను చెల్లింపులకే పోతాయి. కనుక పన్ను మినహాయింపులు, పన్నుల నుంచి చట్టబద్ధంగా ఉండే వెసులుబాట్లను తెలుసుకోవడం లాభదాయకం.

# కేబీఆర్ పార్కు చుట్టూ రెండు ప్యాకేజీలుగా పనులు




**హైదరాబాద్ అక్షరం న్యూస్:**

రాష్ట్ర రాజధానిలో ప్రభుత్వం చేపట్టిన 'హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)' ప్రాజెక్టుల్లో కీలక అడుగు పడింది. కేబీఆర్ పార్కు చుట్టూ స్టీల్ వంతెనలు, అండర్‌పాసల నిర్మాణానికి మూడు సంస్థలు ముందుకు వచ్చాయి. రూ.580 కోట్లతో ప్యాకేజీ-1లో భాగంగా జూబ్లీ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్కు ప్రవేశ ద్వారం, ముగ్ధ జంక్షన్ల వద్దబీ రూ.510 కోట్లతో ప్యాకేజీ-2లో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నంబరు-45, ఫిల్మ్‌నగర్, మహారాజ అగ్రసేన్, క్యాన్సర్ ఆస్పత్రి జంక్షన్ల వద్ద ప్రాజెక్టుల కోసం ఫిబ్రవరి 22న జీహెచ్‌ఎంసీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. బుధవారం సాయంత్రం గడువు ముగియగా.. బల్దియా అధికారులు టెండర్ బాక్స్ తెరిచారు. ఎం.వెంకట్‌రావు(ఎంవీఆర్), మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ(ఎన్‌సీసీ) బిడ్ వేశాయి.సాంకేతిక, ప్రైస్ బిడ్ పరిశీలన ప్రారంభమైంది. కాగా, సాంకే తికంగా ఆయా సంస్థలకు ప్రాజెక్టులు నిర్మించే అర్హత ఉందా..? అన్నది మొదట పరిశీలిం చనున్నారు. అనంతరం అర్హత ఉన్న సంస్థల్లో తక్కువ కోట్ చేసిన రెండు సంస్థలను ఎంపిక చేసి.. కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ)కు పంపుతారు. సీవోటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత వివరాలు ప్రభు త్వానికి వెళ్తాయి. సర్కారు ఆమోదం అనంతరం ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకుంటారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు నెలన్నర నుంచి రెండు నెలలు పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆ లోపు పార్కు చుట్టూ ఆస్తుల సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ భావిస్తోంది.

# నాలుగు బోర్లున్నా ట్యాంకర్ నీళ్లే దిక్కు..

## పంటను కాపాడుకునేందుకు రైతన్న కష్టాలు





**రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని చింతపట్ల గ్రామానికి చెందిన రైతు ఇటికాల వెంకట్‌రెడ్డి తన పంటను కాపాడుకునేందుకు నిత్యం నానా అవస్థలు పడుతున్నాడు. తన పొలంలో నాలుగు బోర్లున్నప్పటికి తన సాగు ప్రశ్నార్థకంగా మారింది. నాలుగు బోర్లలో ఇప్పటికే ఇటివల కాలంలోనే మూడు బోర్లు పూర్తిగా వట్టి పోయినవి. ఒక బోరు మాత్రం ఆపుతూ అంతంత మాత్రంగానే పోస్తున్నది. తనకున్న 12 ఎకరాల పొలానికిగాను పంటకు నీరందుతుందో లేదోననే సందేహంతో 6 ఎకరాల పొలంలో యాసంగిలో వరిపంటను సాగు చేశాడు. మొదట్లో పంట బాగానే ఉన్నప్పటికి మండలంలో నెలకొన్న కరువులో భాగంగా ఇటివలే అతని బోర్లు అడుగంటి పోయాయి. ఉన్న ఒక్క బోరుతో పంట తడారకపోవడంతో మండుతున్న ఎండలకు క్రమంగా ఎండి పోవడం మొదలైంది. దీంతో రైతు చేసేదేమిలేక కళ్లముందు ఎండిపోతున్న పంటను కాపాడుకునేందుకు సాహసం చేశాడు. ఒక్కో ట్యాంకరు నీటికి రూ.1000 ఖర్చు చేసి నీటి ట్యాంకర్ ద్వారా పంట చేనుకు నీరందించడం మొదలు పెట్టాడు. చేతి కొచ్చిన పంటను పొట్ట దశలో ఎండి పోకుండా రోజుకు నాలుగైదు వేలు ఖర్చు చేసి పంటకు నీరందిస్తున్నాడు.

అయినప్పటికి ఒకవైపు నీరు పెడుతుంటే మరో వైపు పంట ఎండు ముఖం పడుతున్నది. దీంతో చేసేదేమిలేక వెంటక్‌రెడ్డి ఆందోళన చెందుతున్నాడు. పంట పూర్తిగా ఎండిపోతే పశు వుల పాలు కాక తప్పదని వాపోతున్నాడు. వేలాది రూపాయల పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరు చందంగా మారిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పదేళ్ల కాలంలో ఎన్నడు ఇంతటి కరువును చూడలేదని ఈ సారి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నాడు. గత పదేళ్లు చెరువులు, కుంటలు నీటితో కళకళలాడాయని ప్రస్తుతం ఎండిపోవడంతో భూగర్భ జలాలలు అడుగంటి రైతులకు సాగునీటి కష్టాలు వచ్చినట్లు పేర్కొన్నారు. పంటలు ఎండిపోవడంతో ఆర్థికంగా తీవ్రంగా నష్ట పోతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో పంటలెండి పోతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు కనీసం కన్నెత్తి చూడటంలేదని వాపోతున్నాడు. పంటలెండిపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు. రైతులకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని కోరుతున్నాడు. ఇలాంటి ఘటనలు మండలంలో కోకొల్లలుగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో వ్యవసాయం ఎలా ఉంటుందోనని ఊహించుకుంటేనే భయంగా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే రోడెక్కి ఆందోళనలు చేయనున్నట్లు రైతులు హెచ్చరిస్తున్నారు.

# క్యాన్సర్ చికిత్సతో సైడ్ ఎఫెక్ట్స్.. ఆసుపత్రిలో చేరిన కింగ్ చార్లెస్

బ్రిటన్ రాజు చార్లెస్-3 మరోసారి ఆసుపత్రిలో చేరారు. ఇటీవలే ఆయన క్యాన్సర్ బారిన పడిన విషయం తెలిసిందే. చికిత్స అనంతరం కోలుకున్నారు. అయితే, ఆ చికిత్స కారణంగా సైడ్ ఎఫెక్ట్స్ రావడంతో మళ్లీ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన లండన్‌లోని ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు బకింగ్ హామ్ ప్యాలెస్ వెల్లడించింది. మరోవైపు కింగ్ చార్లెస్ ఆసుపత్రిలో చేరడంతో అధికారిక కార్యక్రమాలన్నీ వాయిదా వేసినట్లు పేర్కొంది. కాగా, 76 ఏండ్ల చార్లెస్ -3 క్యాన్సర్ బారిన పడినట్లు గతేడాది ఫిబ్రవరిలో నిర్ధరణ అయ్యింది. ప్రొస్టేట్‌కు చికిత్స సందర్భంగా వైద్య పరీక్షల్లో వ్యాధి బయటపడింది. అప్పటి నుంచి ఆయన చికిత్స తీసుకుంటున్నారు. అయితే అది ఏ రకమైన క్యాన్సరనేది అధికారికంగా వెల్లడించలేదు. ఇటీవలే బెంగళూరుకు వచ్చి కూడా వైద్యం చేయించుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు క్యాన్సర్ చికిత్స కారణంగా సైడ్ ఎఫెక్ట్స్ రావడంతో మళ్లీ ఆసుపత్రిలో చేరారు. 76 ఏండ్ల చార్లెస్-3 తన తల్లి క్వీన్ ఎలిజబెత్ మరణంతో 2022, సెప్టెంబర్ 8న రాజుగా బాధ్యతలు చేపట్టారు.

# హెచ్‌డీఎఫ్‌సీ నుంచి ఐదు కొత్త బిజినెస్ క్రెడిట్ కార్డులు




వ్యాపారులు, స్వయం ఉపాధి పొందేవారి కోసం ప్రత్యేకంగా బిజినెస్ క్రెడిట్ కార్డులు అందుబాటులో ఉంటాయి.వ్యక్తిగత అవసరాల కోసం ఉపయోగించే వాటిలాగే వీటిని వ్యాపార ఖర్చుల కోసం వాడుకోవచ్చు. ఇటీవల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బిజ్‌ఫస్ట్, బిజ్‌గ్రో, బిజ్‌పవర్, బిజ్‌బ్లాక్ పేరిట నాలుగు బిజినెస్ క్రెడిట్ కార్డులను తీసుకొచ్చింది. వాటి వివరాలేంటో చూద్దాం..బిజ్‌ఫస్ట్..బిజ్‌ఫస్ట్ కార్డు పొందేందుకు వార్షిక ఐటీఆర్ విలువ రూ.6 లక్షలకు పైన ఉండాలి. 55 రోజుల వరకు వడ్డీరహిత క్రెడిట్ లభిస్తుంది. ఈఎంఐ చెల్లింపులపై మూడు శాతం క్యాష్ పాయింట్లు ఉంటాయి. యుటిలిటీ బిల్లులు, ఎలక్ట్రానిక్స్, పేజాప్ లావాదేవీలపై రెండు శాతం, ఇతర వ్యయాలపై ఒక శాతం క్యాష్ పాయింట్లు పొందొచ్చు. ఈ కార్డు జాయినింగ్, పునరుద్ధరణ ఫీజు రూ.500. పన్నులు అదనం. తొలి ఏడాదిలో రూ.50 వేలు ఖర్చు చేస్తే తర్వాత సంవత్సరం రెన్యువల్ ఫీజును రద్దు చేస్తారు. స్విగ్గీ డైనౌట్ ద్వారా చేసే రెస్టారంట్ బిల్లు చెల్లింపులపై 20 శాతం వరకు తగ్గింపు లభిస్తుంది.బిజ్‌గ్రో..బిజ్‌గ్రో కార్డుపై కూడా 55 రోజుల వడ్డీరహిత క్రెడిట్ గడువు ఉంటుంది. బిజినెస్ అవసరాల కోసం చేసే ప్రతి రూ.150 ఖర్చుపై రెండు క్యాష్ పాయింట్లు లభిస్తాయి. బిల్లులు, పన్ను చెల్లింపులు, వాణిజ్య సంబంధిత ప్రయాణాల కోసం చేసే ఖర్చులపై 10 పాయింట్లు లభిస్తాయి. వార్షిక ఐటీఆర్ విలువ రూ.6 లక్షలకు పైన ఉండాలి. ఈ కార్డు జాయినింగ్, పునరుద్ధరణ ఫీజు రూ.500. పన్నులు అదనం. తొలి ఏడాదిలో రూ.1 లక్ష ఖర్చు చేస్తే తర్వాత సంవత్సరం రెన్యువల్ ఫీజును రద్దు చేస్తారు. రూ.400 నుంచి రూ.5,000 ఇంధన బిల్లుపై ఒక శాతం ఫ్యుయల్ సర్‌ఛార్జ్ రద్దు ప్రయోజనం ఉంటుంది. అలా గరిష్ఠంగా ఒక బిల్లింగ్ సైకిల్‌లో రూ.250 వరకు రాయితీ పొందొచ్చు. స్విగ్గీ డైనౌట్ ద్వారా చేసే రెస్టారంట్ బిల్లు చెల్లింపులపై 20 శాతం వరకు తగ్గింపు లభిస్తుంది.బిజ్‌పవర్..బిజ్‌పవర్ కార్డు కోసం వార్షిక ఐటీఆర్ విలువ రూ.12 లక్షలకు పైగా ఉండాలి. ఈ కార్డుతో వ్యాపార అవసరాల నిమిత్తం చేసే ప్రతి రూ.150 ఖర్చుపై ఐదు రివార్డు పాయింట్లు లభిస్తాయి. బిల్లులు, పన్ను చెల్లింపులు, వ్యాపార ప్రయాణాలకు ఇది వర్తిస్తుంది. దేశీయ విమానాశ్రయాల్లో లాంజ్ యాక్సెస్ ఉచితం. మిగతా కార్డుల్లోలాగే దీని బిల్లింగ్ సైకిల్ కూడా 55 రోజులు. అంటే ఈ వ్యవధిలో బకాయిలు చెల్లించేస్తే ఎలాంటి వడ్డీ ఉండదు. ఈ కార్డు జాయినింగ్, పునరుద్ధరణ ఫీజు రూ.2,500. పన్నులు అదనం. తొలి ఏడాదిలో కనీసం రూ.4 లక్షలు ఖర్చు చేస్తే తర్వాత సంవత్సరం రెన్యువల్ ఫీజు ఉండదు. దేశీయంగా 16 ఎయిర్‌పోర్టు లాంజ్ యాక్సెస్‌లు ఉచితం. ఒక త్రైమాసికంలో రూ.75,000 ఖర్చు చేస్తే మరో రెండు అదనపు యాక్సెస్‌లు లభిస్తాయి. ప్రియారిటీ పాస్‌ను ఉపయోగించి అంతర్జాతీయ విమానాశ్రయాల్లోనూ లాంజ్ యాక్సెస్ పొందొచ్చు.

బిజ్‌బ్లాక్..దీంట్లోనూ ప్రతి రూ.150 వ్యాపార ఖర్చులపై ఐదు రివార్డు పాయింట్లు లభిస్తాయి. ఎయిర్‌పోర్టుల్లో అపరిమిత లాంజ్ యాక్సెస్ ఉంటుంది. ట్యాలీ, ఆఫీస్ 365, ఏడబ్ల్యూఎస్, గూగుల్, క్రెడ్‌ఫ్లో, అజూర్ సహా ఇతరత్రా బిజినెస్ ప్రొడక్టివిటీ టూల్స్‌పై చేసే వ్యయాలకూ రివార్డు పాయింట్లు పొందొచ్చు. ఒక స్టేట్‌మెంట్ సైకిల్‌లో కనీసం రూ.50 వేలు ఖర్చు చేస్తే రివార్డు పాయింట్లను క్లెయిం చేసుకోవచ్చు. ఈ కార్డు జాయినింగ్, పునరుద్ధరణ ఫీజు రూ.10 వేలు. పన్నులు అదనం. కార్డు పొందిన 90 రోజుల్లోగా రూ.1.5 లక్షలు ఖర్చు చేస్తే తొలి ఏడాది రెన్యువల్ ఫీజును రద్దు చేస్తారు. వార్షిక ఐటీఆర్ విలువ రూ.21లక్షలకు పైన ఉండాలి.ఐటీఆర్, జీఎస్టీ రిటర్నులు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, మర్చంట్ పేమెంట్ రిపోర్టులను ఉపయోగించి ఈ కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చు. 21-65 ఏళ్ల వయసున్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న భారత పౌరులు వీటికి అర్హులు.

# బిజినెస్

## రూ.664 కోట్ల సమీకరణ లక్ష్యంతో 2 ఐపీఓలు ప్రారంభం




పీవీసీ స్టెబిలైజర్ల తయారీ సంస్థ ప్లాటినం ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఐపీఓ మంగళవారం ప్రారంభమైంది. ఫిబ్రవరి 29 వరకు షేర్లకు బిడ్లు దాఖలు చేయొచ్చు.ధరల శ్రేణిని రూ.162-171గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద రూ.235.32 కోట్లు సమీకరించనుంది. మదుపర్లు కనీసం రూ.14,877తో 87 షేర్లు సబ్‌స్క్రైబ్ చేసుకోవాలి. రిటైల్ మదుపర్లకు 35 శాతం, అర్హతగల సంస్థాగత కొనుగోలుదారులకు 50 శాతం, సంస్థాగతేతర మదుపర్లకు 15 శాతం షేర్లను కేటాయించారు. ఈ ఐపీఓలో మొత్తం 1.38 కోట్ల కొత్త షేర్లను జారీ చేస్తున్నారు. ఆఫర్ ఫర్ సేల్ కింద ఎలాంటి వాటాలు అందుబాటులో లేవు. కంపెనీ షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో లిస్టవుతాయి.ప్లాటినం ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ను 2016లో స్థాపించారు. పీవీసీ స్టెబిలైజర్లు, సీపీవీసీ అడిటివ్‌లు, ల్యూబ్రికెంట్లను తయారు చేస్తుంది. పీవీసీ పైపులు, ప్రొఫైళ్లు, ఫిట్టింగులుబీ ఎలక్ట్రికల్ వైర్లు, కేబుళ్లుబీ ఎస్‌పీసీ ఫ్లోర్ టైళ్లు, రిజిడ్ పీవీసీ ఫోమ్ బోర్డులు, ప్యాకేజింగ్ మెటీరియళ్లలో ఈ కంపెనీ ఉత్పత్తులను వినియోగిస్తారు. మహారాష్ట్రలోని పాల్‌ఘర్‌లో కంపెనీ తయారీ కేంద్రం ఉంది. జులై 2023 నాటికి ఈ సంస్థకు 12 పంపిణీ కేంద్రాలున్నాయి.ఎగ్జికామ్ టెలీ-సిస్టమ్స్ లిమిటెడ్ ఐపీఓ సైతం ఈరోజే ప్రారంభమైంది. గురువారం వరకు షేర్లకు బిడ్లు దాఖలు చేయొచ్చు. ధరల శ్రేణిని రూ.135-142గా నిర్ణయించారు. గరిష్ఠ ధర వద్ద రూ.429 కోట్లు సమీకరించనుంది. మదుపర్లు కనీసం రూ.14,200తో 100 షేర్లు సబ్‌స్క్రైబ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ఐపీఓలో మొత్తం రూ.329 కోట్లు విలువ చేసే షేర్లను కొత్తగా జారీ చేస్తున్నారు. మరో రూ.100 కోట్లు విలువ చేసే 70.42 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయిస్తున్నారు. ఈ షేర్లు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలో లిస్టవుతాయి.ఎగ్జికామ్ టెలీ-సిస్టమ్స్ లిమిటెడ్‌ను 1994లో స్థాపించారు. పవర్ సిస్టమ్స్, విద్యుత్తు వాహనాల ఛార్జింగ్ సంబంధిత వసతులను కల్పిస్తోంది. ఇప్పటి వరకు ఈ కంపెనీ భారత్ సహా ఆగ్నేయాసియాలో 61,000 డీసీ, ఏసీ ఛార్జర్లను ఏర్పాటు చేసింది. 2023 సెప్టెంబర్ నాటికి 15 ప్రముఖ వాహన తయారీ సంస్థలు దీనికి కస్టమర్లుగా ఉన్నాయి.

# ఆరోగ్యం- మహాభాగ్యం

## వ్యాయామం చేస్తే.. ఇలా తినాలి!



ఆరోగ్యంగా ఉండాలన్నా, దృఢంగా మారాలన్నా... కేవలం కసరత్తులు చేస్తేనే సరిపోదు. వ్యాయామంతో పాటు కచ్చితమైన ఆహార నియమాలూ పాటించాలి. అవేంటంటే..వ్యాయామాలు చేసేవారు ఏదో ఒక తేలికపాటి భోజనంతో సరిపెట్టుకోకూడదు.ఆహారంలో తగినన్ని ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లూ ఉండేలా చూసుకోవాలి. అది కూడా ఒకేరకం పదార్థాల నుంచి కాకుండా వేర్వేరు రకాల ఆహారాల నుంచి అవి అందేట్టు చూసుకోవాలి. ఇందుకోసం అప్పటికప్పుడు ఆలోచించుకోకుండా, వారానికి సరిపడా డైట్‌ప్లాన్‌ని ఒక్కసారే వేసుకుంటే మంచిది. ఈ విషయంలో మీకు గైడ్ చేసేందుకు బోలెడు యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.లేదా నిపుణులని సంప్రదిస్తే మరీ మంచిది.వ్యాయామం అయినా, ఆహారమైనా.... ఎంత అవసరమో అంతే తీసుకోవాలి. ఎలాగూ కసరత్తులు చేస్తున్నాం కదా అని అతిగా తినేయడం సరికాదు. సన్నబడాలన్న తపనతో అసలు తినకుండా కూడా వర్కవుట్లు చేయకూడదు.వర్కవుట్స్ చేయడానికి ముందు తినే స్నాక్స్‌లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేట్టు చేసుకోవాలి. అప్పుడే తగినంత ఉత్సాహంతో వ్యాయామం చేయగలుగుతాం.కార్డియో ట్రైనింగ్‌కు వెళ్లేవారు పొట్టను ఎంత వీలైతే అంత ఖాళీగా ఉంచుకోవడానికి ప్రయత్నించాలి. ఒక కప్పు గ్రీన్ టీ, ఏదైనా పండు తీసుకుంటే సరిపోతుంది. వర్కవుట్స్ తర్వాత తృణధాన్యాలతో చేసిన ఉప్మా, దోసె, కొవ్వు తక్కువగా ఉండే పాలు, పండ్ల రసాలు, పెరుగు వంటివి తింటే... కండరాలకు సాంత్వన లభిస్తుంది. భోజనం తర్వాత వ్యాయామం చేయాలనుకుంటే కచ్చితంగా మూడు నుంచి నాలుగు గంటల విరామం ఇచ్చి తర్వాతే జిమ్‌కి వెళ్లాలి.

## ఆ కాన్పుని... ముందుగా పసిగట్టొచ్చా?



మామూలుకన్నా గర్భిణుల్లో గుండెకొట్టుకునే వేగంలో మార్పు వస్తుందని మనకి తెలుసు! 'ఆ మార్పుల్ని సరిగ్గా అంచనావేసి నెలలు నిండకుండానే జరిగే కాన్పుల్ని అడ్డుకోవచ్చా?కనీసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చా?' అన్న దిశగా పరిశోధిస్తున్నారు శాస్త్రవేత్తలు. గుండె వేగాన్ని(హార్ట్ రేట్ వేరియబుల్స్- హెచ్‌ఆర్‌వీ) కొలిచే వాచ్‌లాంటి పరికరాల వాడకం ఇటీవల పెరుగుతున్న నేపథ్యంలో ఇది సులభం కూడానని చెబుతున్నారు అమెరికాలోని వెస్ట్ వర్జీనియా వర్సిటీ పరిశోధకులు. ప్రపంచంలోని 15 దేశాల్లో వీటిని వాడుతున్న సుమారు 250 మంది గర్భిణుల 'హెచ్‌ఆర్‌వీ'ని వీళ్ళు విశ్లేషించారు. నెలలు పూర్తిగా నిండాక ప్రసవించిన వారిలో- గర్భం ధరించాక గుండెకొట్టుకునే వేగం సాధారణంకన్నా తగ్గి, ఏడో నెల(35వ వారం నుంచి) పెరగడాన్ని చూశారట.అదే- నెలలు నిండక ముందే కాన్పయినవారిలో ఏడునెలలప్పుడు పెరగాల్సిన గుండెవేగం ముందుగానే ఎక్కువకావడం, మళ్ళీ ఉన్నపళంగా తగ్గడం... ఇలా విపరీతమైన హెచ్చుతగ్గుల్ని గమనించారట. కాబట్టి, ఈ అసాధారణ మార్పు ముందస్తు కాన్పుకి సూచికవుతుందన్న నిర్ణయానికి వచ్చారు. దీన్ని గుర్తించగానే జాగ్రత్తలు తీసుకోవడం మంచిదంటున్నారు!

## 'సీరం'...సొగసరి కోసం!



ముఖమంతా నల్లగా మారిపోయింది ఏం చేయాలి...ఈ మొటిమలు పోవాలంటే అసలేది వాడాలి... చర్మం నిగనిగలాడుతూ కనిపించాలంటే ఏ క్రీమ్ కొనాలి... అమ్మాయిల మనసుల్లో మెదులుతున్న ఇలాంటి ప్రశ్నలన్నింటికీ ఈమధ్య బాగా వినిపిస్తున్న సమాధానం 'సీరం వాడితే సరి' అన్నమాట...

అసలేంటీ సీరం... ఏమా సంగతులు...'అందమైన ప్రేమరాణి లేత బుగ్గపై చిన్న మొటిమ కూడా ముత్యమేలే' అంటూ అమ్మాయి అందాన్ని ఎంతగా పొగిడినా... ముఖంపైన చిన్న మచ్చ కూడా ఉండకూడదనే కోరుకుంటుంది ఏ అమ్మాయైనా. ఏ వయసులోనైనా మేలిమి ఛాయతో మెరిసిపోవాలనుకుంటూ అందాన్ని పెంచుకోవడానికి ఎన్నెన్నో సౌందర్యోత్పత్తులూ వాడేస్తుంది. అందుకోసమే మార్కెట్లోనూ బోలెడన్ని క్రీములూ, లోషన్లూ వస్తుంటాయి. ఈమధ్య వాటన్నింటినీ పక్కనపెడుతూ రకరకాల సీరమ్స్ వచ్చాయి. అందానికి సంబంధించిన చర్మ సమస్యలేవైనా కానీ సీరమ్ మంచి సొల్యూషన్ అంటూ వైద్యులూ వీటినే సూచిస్తున్నారు.సీరమే ఎందుకంటే...మందు ఏదైనా నేరుగా చర్మంలోకి చొచ్చుకుపోతేనే కదా అక్కడున్న సమస్య సమసిపోతుంది. సరిగ్గా ఈ సీరమ్స్ విషయంలోనూ అదే జరుగుతుంది. విటమిన్లూ, ఇతర పోషకాల్లాంటివన్నీ కూడా సీరమ్‌లో చిన్న చిన్న అణువుల్లా ఉంటాయి. ఇవి చర్మంలోని లోతైన పొరల్లోకీ సులువుగా చొచ్చుకునిపోయి చర్మానికి అవసరమైన పోషకాల్ని నేరుగా అందిస్తాయి. అందుకే మరి, చాలా తక్కువ సమయంలోనే కావాల్సిన ఫలితం వస్తుందన్నమాట.ఎలా పనిచేస్తాయి...బ్లాక్ హెడ్స్, మొటిమలు, మచ్చలు, రంధ్రాలు, ముడతలు, గీతలు... ఇలా ఒక్కో అమ్మాయికి ఒక్కో ఇబ్బంది. వీటిల్లో ఒక్కో దానికి ఒక్కోరకమైన సీరం దొరుకుతోంది. చర్మం మెరవడానికి సిట్రిక్ యాసిడ్‌తో ఉండే విటమిన్ సీ సీరం, ముడతలూ, గీతలూ పోయి కొత్త మెరుపును సంతరించడానికి రెటినాల్‌తో వచ్చే యాంటీఏజింగ్ సీరం, చర్మం ప్లఫ్ఫీగా నిగారింపుతో ఉండటానికి హైలురోనిక్ సీరం... యాంటీఆక్సిడెంట్లతో చర్మం మీదున్న బ్యాక్టీరియాల్ని తొలగించే విటమిన్ ఇ సీరం... లాంటివెన్నో అందుబాటులో ఉన్నాయి. ఇంకా ఎక్కువమందికి ఉపయోగపడేది నియాసినమైడ్ సీరం.

## గ్రామ గ్రామాన రేషన్ స్లిప్ లు అందజేత





మద్నూర్ /జూలై 28 (అక్షరం న్యూస్ –కామారెడ్డి )

మద్నూర్ మండల కెంద్రంలోని ఆయా గ్రామాలలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో రేషన్ స్లిప్ లు అందజేశారు. సోమవారం రోజున గ్రామ పంచాయతీ సెక్రెటరీ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అర్హులై మంజూరైనా రేషన్ స్లిప్ లు పంపిణి చేశారు. రేషన్ కార్డులు మంజూరైనా లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ సంతోషాన్ని వ్యక్త పర్చడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కు పాటు పడే ప్రజా పాలన ప్రభుత్వం అనీ కొనియాడారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గ్రామ ప్రజల యొక్క ఆశీర్వాదం తో భారీ మెజారిటీలతో గెలుపొందటం జరుగుతుందని తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వారం రోజుల నుండి గ్రామాలను సందర్శించి మంజూరైనా రేషన్ స్లిప్ లు అందజేయడం జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం, జుక్కల్ ఎమ్మెల్యే కాంతారావు అభివృద్ధి పరుస్తున్న సంక్షేమలాను ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దారస్వార్ సాయిలు, యుత్ మండల అధ్యక్షుడు హన్మంత్ యాదవ్, సొసైటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చౌలవార్ హన్మాండ్లు స్వామి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు వాటనల్ వార్ రమేష్, మెనూర్ మాజీ సర్పంచ్ విట్టల్ గురూజీ,

## శ్రీమహాదేవ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 28: పరమ శివుడికి అత్యంత ప్రీతి పాత్రమైన శ్రావణ మాస మొదటి సోమవారం మం డల కేంద్రంలోని శ్రీమహాదేవ స్వామి ఆలయం భక్తుల శివనామ స్మరణతో మారుమోగింది. ఆలయంలో తెల్లవారు జామును నుంచే భక్తులు భక్తిపారవశ్యంతో అభిషేకాలు, అర్చనలు. రుద్రభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి పిండిప్రోలు శ్రీనివాస శర్మ, కూరెళ్ల వేదకుమార్. మంచెన హరీష్ కుమార్, బచ్చు చిరంజీవులు, మోర్తాల ఆ క్ష్మణ్, లగిశెట్టి వీరలింగం, చింతకింది కృష్ణమూర్తి, కూరెళ్ల వినయ్ కుమార్, మంతెన ఉప్పలయ్య, మహేందర్ తదితరులు పాల్గొన్నారు

## కొత్తపల్లి స్కూల్ లో విద్యార్థులకు షీటీం అవగాహన సదస్సు



పెద్దపల్లి రూరల్ జూలై 28 అక్షరం న్యూస్

రామగుండం సిపి గారి ఆదేశాల మేరకు షీ టీమ్ ఇంచార్జ్ ఎస్ఐ లావణ్య ఆధ్వర్యంలో పెద్దపెల్లి మండలం కొత్తపల్లి లోని జడ్పిహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులకు షీటీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది అందులో భాగంగా షీటీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ పై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీటీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో షీటీమ్ సభ్యులు మౌనిక సురేష్ మరియు హెడ్ మాస్టర్ మాధురి విద్య కమిటీ చైర్మన్ సతీష్ మరియు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# గిరిజన మ్యూజియంను తిలకించిన కేంద్ర జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం

భద్రాద్రి కొత్తగూడెం /భద్రాచలం /జూలై 28/ అక్షరం న్యూస్ : గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మరియు వారి కట్టుబాట్లు నేటితరం గిరిజనులకు తెలిసే విధంగా ఏర్పాటుచేసిన మ్యూజియంను కేంద్ర జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం తిలకించి ఆనందం వ్యక్తం చేశారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.సోమవారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ఏజెన్సీ ఏరియాలో గిరిజనులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పరిశీలన చేయడానికి గిరిజన గ్రామాలలో నివసిస్తున్న గిరిజనుల కుటుంబాలను వారికి అందుతున్న పథకాల గురించి వివరాలు సేకరణలో భాగంగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను వారు సందర్శించారు. మ్యూజియంలో పొందుపరిచిన గిరిజనుల అన్ని కళాఖండాలను, పెయింటింగ్ చిత్రాలను క్లుప్తంగా తిలకించారని ఆయన అన్నారు. మ్యూజియం తిలకించిన అనంతరం నేషనల్ లెవెల్ మానిటరింగ్ బృందం ఖాదర్ బాషా రీసెర్చ్ ఆఫీసర్, అబ్దుల్ బషీర్ అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్ మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు నేటితరం గిరిజన యువతి యువకులకు, గిరిజన బాల బాలికలకు, పర్యాటకులకు తెలిసే విధంగా కళాఖండాలు



ఏర్పాటు చేయడం మరియు వాటి యొక్క చరిత్ర ప్రదర్శించడం వలన నేటితరం గిరిజనులె కాక పర్యాటకులు కూడా పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని సంస్కృతి సాంప్రదాయాలు ఆచరించడానికి అవకాశం ఉందని అన్నారు. మ్యూజియంలోని గిరిజనులకు సంబంధించిన పాతకాలపు వస్తువులు, కళాఖండాలు, ఆభరణాలు, పెయింటింగ్ చిత్రాల గురించి స్పష్టమైన సమాచారం సందర్శకులకు తెలిసే విధంగా మ్యూజియం నిర్వహకులు ప్రతి అంశం తెలియజేయడం చాలా బాగుందని అన్నారు. అలాగే పాతతరం గిరిజనులు వాడే పనిముట్లు, గిరిజన వంటకాలు చాలా అద్భుతంగా ఉన్నాయని అన్నారు.అనంతరం గిరిజన మహిళలు తయారు చేస్తున్న మిల్లెట్ బిస్కెట్ల తయారీ కేంద్రాన్ని సందర్శించి, బిస్కెట్ల తయారీ కొరకు వాడుతున్న ఆహార పదార్థాల గురించి మహిళలను అడిగి తెలుసుకుని, భారతదేశ ప్రధానమంత్రి మిల్లెట్ బిస్కెట్ల ప్రాముఖ్యత గురించి మన్ కీ బాత్ లో ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రసంగించడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం పేరు లండన్ వరకు పాకిపోయిందని, అందుకు మిల్లెట్ బిస్కెట్ల తయారీకి ఐటీడీఏ పీవో గిరిజన మహిళలకు సహకారం అందించడంతో ఈ మహిళలు మరింత ఉత్సాహంతో మిల్లెట్ బిస్కెట్ల కేంద్రాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకొని రావడానికి అవకాశం ఉందని వారు తెలిపారు. అనంతరం దాదాపు 3000 రూపాయల వరకు వివిధ రకాల మిల్లెట్ బిస్కెట్లను వారు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం నిర్వహకులు వీరాస్వామి, డిఎస్ఓ ప్రభాకర్ రావు, అపర్ణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్ లో స్వయం ఉపాధి పథకాలకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే గిరిజనులు అర్జీలు పెట్టుకోవాలని..



భద్రాద్రి కొత్తగూడెం /భద్రాచలం /జూలై 28 /అక్షరం న్యూస్ : గిరిజన దర్బార్లో అర్జీదారులు ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తులు ఇవ్వకూడదని , స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి,స్వయం ఉపాధి పథకాలకు సంబంధించిన దరఖాస్తులను మాత్రమే గిరిజనులు అర్జీలు పెట్టుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.

సోమవారం నాడు ఐటిడిఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి ,మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజనులకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన అన్నారు.

గిరిజన దర్బార్ లో ఎక్కువ శాతం దరఖాస్తులు పోడు భూముల పట్టాల కొరకు, పోడు భూముల పట్టాలలో పేర్లు మార్పు కొరకు, రైతుబంధు రుణాల కొరకు, మీసేవ కేంద్రాలు నెలకొల్పుకొని జీవనోపాధి పెంపొందించుట కొరకు,గిరిజన గ్రామాలలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు కొరకు ,పై చదువులు చదవడానికి ఆర్థిక సహాయం కొరకు, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకొనుట కొరకు,జీవనోపాధి పెంపొందించుకోవడానికి సబ్సిడీ రుణాల కొరకు ,కిరాణా షాపులు ,ఫ్యాన్సీ స్టోర్లు పెట్టుకొని జీవించడానికి రుణ సౌకర్యం ఇప్పించుట కొరకు ,మరియు వ్యవసాయానికి సంబంధించి కరెంటు ,మోటారు ,బోరు ఇప్పించుట కొరకు, అలాగేపంట పొలాలలో సోలార్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించుట కొరకు,కొత్తగా చేపల సొసైటీలు ఏర్పాటు కొరకు, గురుకులాలలో ఐదవ తరగతి మరియు ఇంటర్మీడియట్లో అడ్మిషన్లు ఇప్పించుట కొరకు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించుట కొరకు, గిరిజనులు దరఖాస్తులు సమర్పించారని అన్నారు. గిరిజనులు సమర్పించిన దరఖాస్తులను ప్రత్యేకమైన రిజిస్టర్లో నమోదు చేసి ,అర్హులైన ప్రతి గిరిజనులకు విడతల వారీగా ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించి, వారి జీవనోపాధికి తప్పకుండా కృషి చేస్తామని ఆయన అన్నారు.

ఈరోజు సమర్పించిన దరఖాస్తులలో టేకులపల్లి మండలం బర్లగూడెం గ్రామానికి చెందిన శంకర్ పోడుభూముల పట్టాలు ఇప్పించుట కొరకు, అశ్వరావుపేట మండలం కేశప్ప గూడెం, బచ్చు వారి గూడెం చెందిన ద్వారకామయి, సుబ్బారావు సిఆర్టి ఉద్యోగం, ఎం ఎస్ ఎం ఈ పథకము ద్వారా రుణం ఇప్పించుట కొరకు, ఏంకూరు మండలం కాసుల గూడెంకు చెందిన నాగయ్య తమ పొలంలో సోలార్ మరియు బోరు ఇప్పించుట కొరకు, చర్ల మండలం ఎర్రబోడు గ్రామానికి చెందిన సన్యాసి చేపల చెరువు నిర్మాణం కొరకు, ములకలపల్లి మండలం చెరుకు గూడెం గ్రామానికి చెందిన సుజాత ఇందిరమ్మ ఇల్లు ఇప్పించుట కొరకు, దమ్మపేట మండలం నల్ల వారి గూడెం గ్రామానికి చెందిన కుమారి పోడుపట్టాలలో పేర్లు మార్పు కొరకు, ఇల్లందు మండలం పాత నగర్ గ్రామానికి చెందిన గంగాధర్ రావు రైతు భరోసా ఇప్పించుట కొరకు, సింగరేణి మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన ప్రసాద్ మరియు గ్రామస్తులు ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాల ద్వారా పంట రుణాలు ఇప్పించుట కొరకు దరఖాస్తులు చేసుకున్నారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణెమ్మ ,ఏవో సున్నం రాంబాబు,ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ హరీష్ ,డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీనారాయణ, ఏడి అగ్రికల్చర్/ఎస్ ఓ భాస్కర్ , ఏపీవో పవర్ వేణు, పి వి టి జి అధికారి రాజారావు,మేనేజర్ ఆదినారాయణ, జేడీఎం హరికృష్ణ, ఐ సి డి ఎస్ సూపర్వైజర్ అనసూయ, ఐటీడీఏ లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు నరేందర్, భార్గవి, ప్రసాద్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కాలేయ వ్యాధి అవగాహన కార్యక్రమం

**మనిషికి ఆహారమే ఔషధాలు కావాలి కానీ ఔషధాలు ఆహారం కాకూడదు**

**క్లబ్ డైరెక్టర్, ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ శరణ్య యాదవ్**

రామగిరి( పెద్దపల్లి జిల్లా) జులై 28 అక్షరం న్యూస్:

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కాలేయ వ్యాధి అవగాహన కార్యక్రమం సెంటినరీ కాలనీ లో ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం లయన్స్ క్లబ్ డైరెక్టర్, ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ శరణ్య యాదవ్ మాట్లాడుతూ, వైరల్ హెపటైటిస్ ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి దాని బారిన పడకుండా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు తెలియజేయుటకు ప్రతి సంవత్సరం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అలాగే కాలేయ వ్యాధి అనేది వాపుకు కారణమవుతుంది, ఇది తీవ్రమైన కాలేయ సంబంధిత వ్యాధులు కాలేయ క్యాన్సర్కు దారితీస్తుందనీ, హెపటైటిస్ ఇన్ఫెక్షన్లు తేలికపాటి అనారోగ్యాన్ని కలిగిస్తాయ అన్నారు. కొన్నిసార్లు గుర్తించడానికి వీలు కాదు, కొన్నిసార్లు, ఇది తీవ్రమైన కాలేయ వ్యాధిని పెంచుతుందనీ, ప్రాణాంతకం కావచ్చు, దీనికి కాలేయ మార్పిడి అవసరం అయ్యే పరిస్థితికి దారితీస్తుందన్నారు . ప్రస్తుత సమాజంలో హెపటైటిస్ సంబంధిత అనారోగ్యంతో ప్రతి 30 సెకన్లకు ఒక వ్యక్తి మరణిస్తున్నందున,



కాకూడదు అని తెలిపారు.

ప్రాణాలను కాపాడటానికి ఆరోగ్య ఫలితాలను మెరుగు పరచడానికి మెరుగైన నివారణ, రోగ నిర్ధారణ చికిత్సపై తీసుకొనే నివారణ చర్యలను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా వ్యాధికి గురైన వారు తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్త ఏమిటంటే, ఆహారం అలవాట్లు, వారి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే దాని గురించి తెలుసుకోవడం మీ జీవనశైలిలో సాధించగల చిన్న చిన్న మార్పులు చేసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలనీ, అలాగే మనిషికి ఆహారమే ఔషధాలు కావాలి కానీ ఔషధాలు ఆహారం

## ఎమ్మెల్యేకడియంను కలిసిన ఖిలాషాపూర్ గ్రామస్తులు

జనగామ జిల్లా/రఘునాదపల్లి/( అక్షరం న్యూస్ )జూలై 28: హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారకోడు రాంబాబు ఆధ్వర్యంలో మండలంలోని ఖిలాషాపూర్ గ్రామస్థులు ఎమ్మెల్యేను సోమవారం కలిశారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ స్కూల్ను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, ఎమ్మెల్యే వెంటనే స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెకర్ కు ఫోన్ చేసి మాట్లాడి మంజూరు ఇప్పించారు. అలాగే బాల వికాస్ సంస్థ వారితో మాట్లాడి సుమారు 200 మంది విద్యార్థులకు సరిపడ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముప్పిడి శ్రీధర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్పర్సన్ నీల స్వాతి వీరన్న, రాజమౌళి, అంజన్న రవిందర్, ఉదయ్,చ%శీ% ద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



# బొమ్మకూరు రిజర్వాయర్ నీటి సరఫరా పరిశీలన

**జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు**






జనగామ జిల్లా/రఘునాథపల్లి/(అక్షరం న్యూస్ )జూలై 28: ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబుతో పాటు దేవాదుల డిఈ శ్రావణ్ కుమార్, ఏఈ వెంకన్న సోమవారం బొమ్మకూరు రిజర్వాయర్ ను సందర్శించి మల్లన్న గండి నుండి వచ్చే పంపింగ్ నీటిని పరిశీలించారు. బొమ్మకూరు రిజర్వాయర్ నుండి మండలంలోని మేకలగట్టు, మంగలిబండ తండకు సాగు నీరు అందించే కాలువను పరిశీలించిన అనంతరం రాంబాబు మాట్లాడుతూ కాలువల ద్వారా చెరువులు నింపడానికి, రైతులు పంటలకు సాగు నీరు అందించడానికి నీరు విడుదల చేసినట్లు తెలిపారు. రిజర్వాయర్ నుండి నీరు వెళ్లే కాలువలో పేరుకపోయిన పూడిక. విపరీతంగా పెరిగిన తుంగ, నాసును తొలగించి రైతులకు పంట కాలువ ద్వారా సరిపోను నీరు అందించేటట్లు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, ప్రకాష్ రెడ్డి, నారగోని కుమార్, తూడి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఎన్‌టీపీసీ సహకారంతో గ్రామ యువతకు ఉజ్వల అవకాశాలు

**సిపెట్ శిక్షణ ఉద్యోగ అవకాశాలు**



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూలై 28 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఎన్‌టీపీసీ రామగుండం లో తెలంగాణ కార్యాలయంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపెట్) ప్రతినిధి ధర్మరాజు సోమవారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంతా ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఏడాది కూడా ఈ ప్రాంత యువతకు ప్లాస్టిక్ రంగంలో శిక్షణ ఇస్తామని వివరించారు.ఈ సందర్భంగా శ్రీ ధర్మరాజు సిపెట్ సంస్థ ద్వారా అందించబడుతున్న శిక్షణతో పాటు ఉద్యోగావకాశాల వివరాలు తెలియజేశారు. ఎన్‌టీపీసీ రామగుండం సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం అమలు కావడం జరుగుతోంది. ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల (పాప్) నిరుద్యోగ యువతకు ఇది ఒక గొప్ప అవకాశం.ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేసిన సమంతా గారు, స్థానిక యువతను ప్రోత్సహించి, ఎక్కువమంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హత ఉన్న అభ్యర్థులకు 100 శాతం ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని హామీ ఇచ్చారు. శిక్షణ అనంతరం యువత మిషన్ ఆపరేటర్లు, ప్లాస్టిక్ మౌల్డింగ్ నిపుణులుగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది.స్థానిక యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ధర్మరాజు ని 9441247207 నెంబర్‌లో సంప్రదించవచ్చు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని ధర్మరాజు తెలిపారు.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అపహాస్యం

న్యూఢిల్లీ,జూలై28 అక్షరం న్యూస్ )

వారం రోజులుగా పార్లమెంటులో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. సమస్యలపై చర్చించాలన్న ఆసక్తి అధికార విపక్షాలకు లేకుండా పోయింది. సభ ప్రారంభం కాగానే గోడవ చేయడం విపక్షాల వంతు అయితే వాయిదా వేయడం స్పీకర్ విధిగా మారింది. సోమవారం ఉదయం కూడా ఇదే తరహాలో మధ్యాహ్నానికి సభ వాయిదా పడింది. దీనిబదులు సమస్యలు ముందుకు వేసుకుని ఏరోజు ఏది చర్చించాలన్నది నిర్ణయం తీసుకోవచ్చు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివిధ రూపాల్లో చర్చించేందుకు ఉన్న అవకాశాలను వినియోగించు కోవాలి. కానీ ప్రతిష్టంభనతో సాధించేదేమీ లేదని ఇరు పక్షాలు కూడా గుర్తించాలి. ఇప్పుడు వర్షాకాల సమావేశాలు సైతం ఒక్కటంటే ఒక్క సమస్యపై చర్చించడం లేదు. ఈనెల 21న పార్లమెంట్ సమావేశాలు మొదలయ్యాయి. నేటికీ ఒక్క సమస్యపైనా చర్చలేదు. చర్చకు సిద్ధమని అధికార పక్షం చెబుతున్నా.. విపక్షాలకు మాత్రం అవకాశం ఇవ్వడం లేదు. భారతదేశం, ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పడం మనకు బాగా అలవాటయ్యింది. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పార్లమెంట్ అధికారంలో ఉన్న ఒకరిద్దరు నేతల కనుసన్నల్లో సాగుతున్నాయి. ఎందుకిలా అన్న ఆలోచన కూడా చేయడం లేదు. ఇదేదో అధికార,విపక్షాల సమస్యగా చూస్తున్నారు. ఇక్కడ 140కోట్ల ప్రజలంతా ఆందోళనలతో ఉన్నా పట్టించుకోవం లేదు. వరదలతో దేశం మునుగుతున్నా చర్చించడం లేదు. భారతదేశం లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మేడిపండు చందంగా మారిందా అన్న అనుమానాలు బలపడుతు న్నాయి. వ్యక్తిస్వామ్యం, నిరంకుశత్వం ప్రబలిపో తోంది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజల సమస్యల పై చర్చ జరగడం లేదు. అధికార విపక్షాలు కలసి ఇదేదో తమ సొంత జాగీరుగా భావించి.. సమావేశాలను నడుపుకుంటున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఇదే తంతు సాగుతోంది. బిజెపి అధికారం చేపట్టిన తరవాత అసలు సమస్యలపై చర్చ అన్నది మరచిపోయారు. సమస్య ఏదైనా పార్లమెంటులో చర్చకు రావడం లేదు. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీల్లో ఇదే పద్దతి సాగు తోంది. రాష్ట్రాల్లో కూడా అధికార పార్టీ నేతలు చర్చలకు అవకాశం ఇవ్వడం లేదు. ఇకపోతే చట్టసభల్లో చర్చించకుండానే చట్టాలు వస్తున్నాయి. చట్టసభల్లోచర్చించకుండా సమస్యలను దాట వేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నామన్న ఆలోచనచేయడం లేదు. రాబోయే తరాలకు ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో చెప్పడం లేదు.

# శ్రీ చైతన్య పాఠశాలలో కాంపోజిట్ సైన్స్ ల్యాబ్ ప్రారంభించిన రామగుండం ఎన్ టి పి సి ఇ డి







జ్యోతినగర్, ఎన్టిపిసి జూలై 28: పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ ఎన్‌టీపీసీ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో సోమవారం కాంపోజిట్ సైన్స్ ల్యాబ్ ను రామగుండం ఎన్టిపిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సమంత ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నూతన నాయకుల బృందానికి బాధ్యతలు అప్పగించి, వారు నిబద్ధతతో పని చేయాలనే శపథం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌టీపీసీ రామగుండం పరిశీలనా, సాంకేతిక విభాగం అధికారి చందన్ కుమార్ సమంత హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు చిన్న వయసులోనే అలవరచుకోవడం అవసరమని ఆయన తెలియజేశారు. తమ పాఠశాల అభివృద్ధి దిశగా చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు.ఇతర ముఖ్య అతిథులుగా మానవ వనరుల విభాగ అధికారి ప్రవీణ్ కుమార్ చౌదరి, కేంద్రీయ భద్రతా దళం ఉపాధ్యక్షుడు ఎస్.వి. రాజు, నిర్మాణ విభాగం అధికారులు, విద్యా సంస్థ నిర్వాహక బృందం పాల్గొన్నారు. ఈ వేడుకలను శ్రీ చైతన్య పాఠశాల బృందం ఎన్. ఉదయ్ కుమార్ నేతృత్వంలో విజయవంతంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అన్ని శాఖలతో కలిసి పనిచేస్తున్నామన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథుల సమక్షంలో ఈ కార్యక్రమం ఉత్సాహంగా, శ్రద్ధతో సాగింది.



# ప్రపంచాన్ని వణికిస్తున్నహెపటైటిస్

**నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా**



న్యూఢిల్లీ,జూలై28 అక్షరం న్యూస్ )

పంచ కాలేయ వ్యాధి (హెపటైటిస్) దినోత్సవాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించి ఈ రోజున సదస్సులు నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించింది. దీంతో ప్రతియేటా జూలై 28న ప్రపంచ కాలేయ వ్యాధి దినోత్సవాన్ని జరుపుకొంటున్నాము. హెపటైటిస్ బీ వైరస్ను కనుగొన్న నోబెల్ గ్రహీత బరూచ్ శామ్యూల్ బ్లంబర్గ్ కు గుర్తుగా ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఈ రోజును ఏర్పాటు చేశారు. ప్రస్తుత కాలంలో ఉన్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు, ఉద్యోగంలో ఒత్తిళ్లు, మానసిక ఒత్తిళ్లు, నిద్రలేమితనం తదితర కారణాలతో మనిషి ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నాడు. ఇందులో హెపటైటిస్ వ్యాధి. ఇది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని కాలేయం (లివర్)పై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఏ,బి,సి,డి,ఇలు వెలుగు చూసిన ఈ వ్యాధిలో హెపటైటిస్ వ్యాధి చాలా ప్రమాదకరమైనదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి తీవ్రత సిర్రోలిక్ దశకు చేరుకుని ఏకంగా కాలేయం పూర్తిగా దెబ్బతింటుంది. ఈ దశలోకాలేయం మార్పిడి చేయాల్సి వస్తుంది. అందుకు వ్యాధి బారినపడకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది..కాలేయ వ్యాధి ఎక్కువగా ఎవరికి వస్తుంది. ఈ వ్యాధి అధికంగా మద్యం సేవించే వారికి వస్తున్నట్లు తెలుస్తోంది. శరీరంలో చేరే మద్యాన్ని విసర్జించే క్రమంలో కాలేయం ఎక్కువగా శ్రమకు గురవుతుంది. కాలేయం సామర్థ్యానికి మించి మద్యం సేవించినట్లయితే కాలేయ మెల్లమెల్లగా దెబ్బతింటుంది. ఫలితంగా ఆల్కహాలిక్ ఫ్యాటీలివర్ డిసీజ్, ఆల్కహాలిక్ హెపటైటిస్ ఆల్కహాలిక్ సిర్రోసిస్ వ్యాధులు దరిచేరుతాయి. ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్‌లో కాలేయం కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. అలాగే కాలేయం పనితీరు సక్రమంగా ఉన్నా.. ఎంజైమ్ విడుదలలో హెచ్చు తగ్గులు చోటు చేసుకుంటాయి.ఈ పరిస్థితిని మద్యం మానేసి సరిదిద్దుకోవాలి. అతిగా మద్యం సేవించే వారి కాలేయం వాపునకు గురై గట్టిగా తయారవుతుంది. దీనినే ఆల్కహాలిక్ హెపటైటిస్ అంటారు.ఈ వ్యాధితో కాలేయం పనితీరు క్రమంగా అదుపు తప్పుతుంది. వ్యాధి తీవ్రత పెరిగితే కాలేయం విఫలమవుతుంది. హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, వైరస్‌ల వల్ల కాలేయం కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది..లివర్ క్యాన్సర్ ముప్పుహెపటైటిస్ ఇన్‌ఫెక్షన్ లివర్ క్యాన్సర్‌కు కూడా దారి తీసే అవకాశం ఉంది. సాధారణ కాలేయ క్యాన్సర్‌ను హెపటో సెల్యూలార్ క్యాన్సర్ అని అంటారు. దీర్ఘకాలికంగా ఆల్కహాల్ తీసుకునే వారికి ఈ వ్యాధి ఏర్పడుతుంది. దీన్ని కడుపు పైభాగంలో నొప్పితో పాటు బరువు తగ్గడం వంటి లక్షణాలతో గుర్తించవచ్చు. పసికరికలు, నీళ్ల విరేచనాలు వంటి లక్షణాలు కూడా కనిపిస్తుంటాయి. ప్రాథమికంగా రక్తపరీక్ష (ఏఎఫ్‌పీ), అల్ట్రా సౌండ్ పరీక్షలతో గుర్తించవచ్చు. అవసరాన్ని బట్టి సీటీ స్కాన్, ఎండోస్కోపీ, బయాప్సీ పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.'వన్ లైఫ్, వన్ లివర్'.ఈ సంవత్సరం 2023, ప్రపంచ హెపటైటిస్ డే థీమ్ ' వన్ లైఫ్, వన్ లివర్ '. వైరల్ హెపటైటిస్ నివారణ, రోగనిర్ధారణ మరియు చికిత్సను మెరుగుపర చడానికి అవసరమైన కొలతలను వేగవంతం చేయడానికి, తద్వారా కాలేయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ప్రపంచవ్యాప్తంగా 2030 హెపటైటిస్ నిర్మూలన లక్ష్యాలను సాధించడానికి ప్రపంచవ్యాప్తంగా కృషి చేస్తున్నారు.

# పడకేసిన పారిశ్రామికోత్పత్తి.. కీలక రంగాలు కుదేలు

- గనులు, విద్యుదుత్పత్తిలో నిస్తేజం
- జూన్‌లో 1.5 శాతంగానే వృద్ధిరేటు
- గత నెల 10 నెలల కనిష్ఠానికి ఐఐపీ పతనం



దేశంలో కీలక రంగాలు కుదేలవుతున్నాయి. ఆర్థిక, వ్యాపార, పారిశ్రామిక వృద్ధికి దోహదపడే అంశాల్లో నిస్తేజం కనిపిస్తున్నది. అసలే అంతర్జాతీయంగా విపత్కర పరిస్థితులు నెలకొన్న వేళ.. ఈ ప్రతికూల సంకేతాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయిప్పుడు. గడిచిన 4 నెలలుగా భారతీయ పారిశ్రామికోత్పత్తి సూచీ కదలికలు తీవ్ర నిరాశనే మిగులుస్తున్నాయి. అంతకంతకూ పతనమవుతున్న ఉత్పాదక వృద్ధి.. గత నెల జూన్‌లో 10 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 1.5 శాతానికి పరిమితమైంది. గనులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పత్తి నత్తనడకన సాగుతున్నదని తాజాగా విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెప్తుండటం గమనార్హం.

దేశీయ పారిశ్రామిక రంగాన్ని నిస్తేజం ఆవరించింది. ఈ ఏడాది మొదలు పారిశ్రామికోత్పత్తి క్షీణిస్తున్నది మరి. మార్చి నుంచి క్రమేణా పడిపోతున్న వృద్ధిరేటు.. గత నెల దాదాపు ఏడాది కనిష్ఠాన్ని తాకింది. జూన్‌లో 10 నెలల కనిష్ఠ స్థాయిని సూచిస్తూ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 1.5 శాతానికే పరిమితమైందని సోమవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. గత ఏడాది ఆగస్టు తర్వాత ఈ స్థాయిలో ఉత్పాదక వృద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి. ఇక నిరుడు జూన్‌లో 4.9 శాతం వృద్ధిని ఐఐపీ చూపింది.

**గనులు, విద్యుత్తు రంగాలు డీలా**

గనులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత డీలా పడింది. అయితే దేశ ఆర్థిక ప్రగతికి రథ చక్రాలైన ఈ రెండు రంగాల్లో మందగమనం ఇలాగే కొనసాగితే.. మొత్తం జీడీపీ వృద్ధిని అది ప్రభావితం చేస్తుందన్న ఆందోళనలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఏడాది క్రిందటితో పోల్చితే ఈ జూన్‌లో గనుల రంగంలో ఉత్పత్తి వృద్ధిరేటు 10.3 శాతం నుంచి 8.7 శాతానికి తగ్గింది. ఫలితంగా విద్యుదుత్పత్తిపై పెద్ద ఎత్తునే ప్రభావం పడింది. పోయినసారి జూన్‌లో దేశీయ విద్యుదుత్పత్తిలో 8.6 శాతం వృద్ధి నమోదైంది. కానీ ఈ జూన్‌లో 2.6 శాతంగానే ఉన్నది. ఇప్పటికీ దేశంలో విద్యుత్తు అవసరాలు అత్యధికంగా తీరేది బొగ్గు ద్వారానే. దీంతో తగ్గిన బొగ్గు ఉత్పత్తి ప్రభావం.. వెంటనే విద్యుత్తు తయారీపై కనిపించిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**తయారీ వృద్ధీ అంతంతే..**

కీలకమైన తయారీ రంగంలోనూ గత నెల వృద్ధిరేటు అంతంతమాత్రంగానే ఉన్నది. గత ఏడాది జూన్‌లో 3.5 శాతంగా నమోదవగా, ఈ జూన్‌లో అది 3.9 శాతానికి పెరిగిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) తమ తాజా నివేదికలో వెల్లడించింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో ఐఐపీ వృద్ధి కేవలం 2 శాతంగానే ఉన్నది. ఏడాది క్రితం 5.4 శాతంగా ఉండటం గమనార్హం. దీంతో 11 నెలల కనిష్ఠానికి దిగజారినైట్టెంది. ఈ ఏడాది జనవరి-మార్చిలో 4 శాతంగా ఉన్నట్టు ఎన్‌ఎస్‌వో చెప్తున్నది. ఇదిలావుంటే ఈ ఏడాది మే నెలలో ఐఐపీ వృద్ధిరేటును ఎన్‌ఎస్‌వో సవరించింది. ముందుగా 1.2 శాతంగా ప్రకటించగా, దాన్నిప్పుడు 1.9 శాతానికి పెంచింది. క్యాపిటల్ గూడ్స్ రంగంలో వృద్ధిరేటు ఏడాది వ్యవధిలో 3.6 శాతం నుంచి 3.5 శాతానికి తగ్గింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పాదక వృద్ధి గత జూన్‌తో చూస్తే ఈ జూన్‌లో 8.8 నుంచి 2.9 శాతానికి పడిపోయింది.

కన్స్యూమర్ నాన్-డ్యూరబుల్స్ రంగంలోనూ ఉత్పత్తి వృద్ధిరేటు 1 శాతం నుంచి మైనస్ 0.4 శాతానికి దిగింది.

మౌలిక/నిర్మాణ రంగంలోనూ 8.2 శాతం నుంచి 7.2 శాతానికి ఉత్పత్తి క్షీణించింది.

ప్రైమరీ గూడ్స్ ఉత్పత్తిలో వృద్ధిరేటు 6.3 శాతం నుంచి మైనస్ 3 శాతానికి పతనమైనట్టు తాజా గణాంకాల్లో తేలింది

# టెకీల గుండెల్లో ఏఐ గుబులు.. లేఆఫ్స్ ప్రకటించిన టెక్ సంస్థలు




ప్రపంచవ్యాప్తంగా టెక్ ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా 2019లో మొదలైన ఈ కోతలు.. ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ ఏడాది కూడా వందలాది కంపెనీలు.. లక్షలాది మంది ఉద్యోగులను తొలగించాయి. టీసీఎస్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు వేల సంఖ్యలో ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి.

**టీసీఎస్‌లో 12వేల మంది ఔట్..!**

కృత్రిమ మేధ రాకతో ప్రయోజనాల సంగతి ఏమోగానీ ఐటీ ఉద్యోగాలపై దీని ప్రభావం మాత్రం గట్టిగానే పడుతోంది. ఏఐ పుణ్యమాని ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు తమ స్టాఫ్‌ను తగ్గించుకుంటున్నాయి. భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) తన మొత్తం ఉద్యోగులలో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అత్యంత వేగంగా సాంకేతిక మార్పులు చోటుచేసుకుంటున్న వేళ భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సంసిద్ధంగా ఉండక తప్పదని ఆయన అన్నారు. ఉద్యోగుల సంఖ్యను ఎందుకు తగ్గించవలసి వస్తోందన్న ప్రశ్నకు యావత్ ఐటీ పరిశ్రమ మార్పు చెందుతున్నదని, పని చేసే విధానాలు మారుతున్నాయని ఆయన బదులిచ్చారు. 2025 జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 6.13 లక్షల మంది టీసీఎస్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 2 శాతం మంది అంటే సుమారు 12,200 మంది ఉంటారు. లేఆఫ్‌లు జూనియర్ లెవెల్‌లో కాకుండా మిడిల్ మేనేజ్‌మెంట్, సీనియర్ లెవెల్స్‌లో అధికంగా ఉంటాయని కృతివాసన్ స్పష్టం చేశారు.

**మైక్రోసాఫ్ట్‌లో 9 వేల మందికి ఉద్వాసన**

వ్యయ నియంత్రణలో భాగంగా సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీగా ఉద్యోగుల తొలగింపును చేపట్టింది. మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 4 శాతానికి తక్కువ కాకుండా తొలగించాలని నిర్ణయించింది. దీంతో సుమారు 9 వేల మంది ఉద్యోగాలు కోల్పోనున్నారు. ఈ తొలగింపులు %శఎశీఇ%, గేమింగ్ విభాగాల్లో ఉండనున్నాయి. గత 18 నెలల కాలంలో మైక్రోసాఫ్ట్ చేపట్టనున్న నాలుగో అతిపెద్ద ఉద్యోగాల కోత ఇదే కావొచ్చని టెక్ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, మైక్రోసాఫ్ట్ ఈ ఏడాది మే నెల మధ్యలో వేలాది మంది ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. తమ సిబ్బందిలో మూడు శాతం మందికి లేఆఫ్‌లు ఇచ్చింది. అంటే దాదాపు 6వేల మందిని తొలగించింది. 2023లో 10 వేలమందికి ఉద్వాసన పలికిన అనంతరం ఇదే రెండో అతిపెద్ద తొలగింపు. మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించడం, సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడమే ముఖ్య లక్ష్యమని సంస్థ ప్రతినిధి ఒకరు చెప్పారు. ఇక ఈ ఏడాది జనవరి, జూన్ నెలల్లో కూడా పనితీరు ఆధారంగా కొంతమందిని సంస్థ తొలగించిన విషయం తెలిసిందే. డైనమిక్ మార్కెట్‌లో పోటీదారుగా నిలవడానికి, కంపెనీ పునర్ నిర్మాణ లక్ష్యాన్ని చేరుకోవడానికి కోతలు తప్పడం లేదని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. 'మార్కెట్‌లో పైచేయి సాధించేలా సంస్థను ఉత్తమంగా ఉంచేందుకు అవసరమైన సంస్థాగత మార్పులను అమలు చేస్తూన్నాం' అని మైక్రోసాఫ్ట్ తెలిపింది.

**ఇంటెల్‌లో 20 శాతం కోత**

మరోవైపు, ఈ ఏడాది సుమారు 25 వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ప్రముఖ చిప్ తయారీ సంస్థ ఇంటెల్ ఇటీవల ప్రకటించింది. ఇది మొత్తం ఉద్యోగుల్లో 20 శాతం. చిప్ డిజైన్, క్లౌడ్ ఆర్కిటెక్చర్, ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు లేఆఫ్స్‌కు ప్రభావితం కానున్నారు. సమర్థతను పెంచి, చిన్న బృందాలతో వేగంగా పనిచేయడమే తమ లక్ష్యమని కంపెనీ నూతన సీఈవో లిప్-బు టాన్ పేర్కొన్నారు.

**ఐబీఎమ్‌లో 8 వేల మందిపై వేటు..**

టెక్ దిగ్గజం ఐబీఎమ్ కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించినట్లు సమాచారం. దాదాపు 8 వేల మంది ఉద్యోగులపై వేటు వేసినట్లు తెలిసింది. లేఆఫ్స్‌కు గురైన వారిలో ఎక్కువ భాగం హెచ్ఆర్ విభాగం నుంచే ఉన్నట్లు తెలిసింది. ఆటోమేషన్ ప్రచారంలో భాగంగా ఐబీఎమ్ ఇటీవలే హెచ్ఆర్ సిబ్బందిలో కొంత భాగాన్ని ఏఐ వ్యవస్థలతో భర్తీ చేసినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దాదాపు 200 మంది స్థానాలను ఏఐతో భర్తీ చేశారు.

**అమెజాన్, గూగుల్, మెటా..**

ఇవేకాకుండా అమెజాన్, గూగుల్, మెటా వంటి ఇతర అగ్రశ్రేణి ఐటీ కంపెనీలు కూడా ఇదే బాటలో పయనిస్తున్నాయి. అమెజాన్ తన బుక్స్, కిండిల్ విభాగాలతో పాటు పలు ఇతర టీమ్‌లలో వందమంది వరకూ ఉద్యోగులను తగ్గించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 2022 నుంచి ఇప్పటివరకు అమెజాన్ 27 వేల మందికిపైగా ఉద్యోగులను తొలగించింది. జూన్‌లో దాదాపు 100 మంది ఉద్యోగులపై వేటు వేసింది.రానున్న రోజుల్లో మరింత మందిని తొలగించేందుకు అమెజాన్ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఖర్చు తగ్గింపు ప్రణాళిలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 14,000 మందిని తగ్గించాలని యోచిస్తోంది. అంటే దాదాపు 13 శాతం అన్నమాట. ఈ ఏడాది ప్రారంభంలో మెటా 3 వేల మందికిపైగా ఉద్యోగులను తొలగించింది. కాగా, ప్రసూతి, మెడికల్ లీవ్‌లో ఉన్నవారినీ తొలగించారని విమర్శలు వచ్చాయి. సెర్చింజన్ దిగ్గజం గూగుల్.. క్లౌడ్, పీపుల్ ఆపరేషన్స్, సేల్స్ తదితర విభాగాల్లో వందల మంది ఉద్యోగులను తొలగించింది. ఏఐ కారణంగానే ఈ నిర్ణయమని తెలిపింది. లేఆఫ్స్‌తో ఉద్యోగుల గుండెల్లో ఏఐ గుబులు నెలకొంది. ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని భయంతో వణికిపోతున్నారు టెకీలు.

# మా ఆర్థిక వ్యవస్థను స్విచ్చాఫ్ చేసుకోవాలా..?

రష్యా చమురు కొనుగోలు విషయంలో పశ్చిమ దేశాలపై భారత్ మండిపాటు



ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాపై పశ్చిమ దేశాలు పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఆంక్షలు ఉన్నప్పటికీ మాస్కో నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో రష్యా చమురు దిగుమతి చేసుకోవడంపై పశ్చిమ దేశాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వస్తున్నాయి. దీనిపై తాజాగా భారత్ స్పందించింది. పశ్చిమ దేశాల విమర్శలను యూకేలోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి తోసిపుచ్చారు. ఏ దేశం కూడా తమ ఆర్థిక వ్యవస్థను ఆపేయాలని అనుకోదని వ్యాఖ్యానించారు. బ్రిటిష్ రేడియో స్టేషన్ టైమ్స్ రేడియోతో దొరైస్వామి మాట్లాడుతూ.. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అని తెలిపారు. దేశ అవసరాల్లో 80 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్నట్లు చెప్పారు. రష్యా నుంచి చౌక ధరకు చమురు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. అవసరాల మేరకు డిస్కౌంట్‌పై చమురును ఎలా కొనుగోలు చేయకుండా ఉంటాం..? అని ప్రశ్నించారు. పశ్చిమ దేశాలు భారత్‌పై విమర్శలు చేస్తున్నాయన్నారు. 'మేం ఏం చేయాలని పశ్చిమ దేశాలు కోరుకుంటున్నాయి..? మా ఆర్థిక వ్యవస్థను స్విచ్చాఫ్ చేసుకోవాలా..?' అంటూ ప్రశ్నించారు.

## దిగొస్తున్న పుత్తడి ధరలు.. 500 తగ్గిన తులం విలువ



**న్యూఢిల్లీ:** బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. వరుసగా నాలుగోరోజూ సోమవారం కూడా పుత్తడి ధర మరో రూ.500 తగ్గింది. అమెరికా, యూరప్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదరడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల నుంచి ఈక్విటీ మార్కెట్లకు తరలించడంతో వీటి ధరలు భారీగా పడిపోయాయి. దేశీయ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.500 తగ్గి రూ.98,020కి పరిమితమైంది. గత శనివారం కూడా పుత్తడి విలువ రూ.600 తగ్గిన విషయం తెలిసిందే. గడిచిన నాలుగు రోజుల్లో పుత్తడి విలువ రూ.3 వేలు తగ్గినట్టు అయింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర కూడా అంతే స్థాయిలో తగ్గి రూ.97,750గా నమోదైంది. బంగారంతోపాటు వెండి ధరలు తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో కిలో వెండి మరో వెయ్యి రూపాయలు తగ్గింది. దీంతో ధర రూ.1.13 లక్షలకు చేరుకున్నది. అంతకుముందు ఇది రూ.1.14 లక్షలుగా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,337.95 డాలర్లుగాను, వెండి 38.17 డాలర్లుగా ట్రేడవుతున్నది.

## కైనెటిక్ ఎలక్ట్రిక్ స్కూటర్లు

- కైనెటిక్ డీఎక్స్ ఈవీ ధర రూ.1,11,499 (పుణె ఎక్స్‌షోరూం)
- డీఎక్స్ ప్లస్ ఈవీ రేటు రూ.1,17,499
- ఒక్కసారి చార్జింగ్ చేస్తే 116 కిలోమీటర్ల ప్రయాణం
- గరిష్ఠ వేగం గంటకు 90 కిలోమీటర్లు
- రెండు వేరియంట్లలో మార్కెట్‌కు పరిచయం
- డీఎక్స్ ధర రూ.1,11,499




**న్యూఢిల్లీ:** దేశీయ ద్విచక్ర వాహన విపణిలోకి కైనెటిక్ మళ్లీ వచ్చింది. ఒకప్పుడు భారతీయ టూవీలర్ మార్కెట్‌లో సత్తా చాటిన కైనెటిక్ స్కూటర్లు.. ఆ తర్వాతి కాలంలో కనుమరుగైపోయాయి. అయితే ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా కొత్త అవతారంలో కంపెనీ రీ-ఎంట్రీ ఇచ్చింది. సోమవారం తమ ఐకానిక్ మాడల్ డీఎక్స్ పేరిటే డీఎక్స్, డీఎక్స్ ప్లస్ అనే రెండు విద్యుత్తు ఆధారిత స్కూటర్లను పరిచయం చేసింది. ఆకర్షణీయ ఫీచర్లతో వీటిని తీసుకురాగా, వచ్చే మూడేండ్లలో అమ్మకాలపరంగా మార్కెట్‌లోని ప్రధాన సంస్థల్లో ఒకటిగా ఉంటామన్న ఆశాభావాన్ని కైనెటిక్ ఇంజినీరింగ్ ఈ సందర్భంగా వ్యక్తం చేసింది. అలాగే రాబోయే 18 నెలల్లో రూ.177 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు కంపెనీ వైస్ చైర్మన్, ఎండీ అజింక్య ఫిరోదియా తెలిపారు. దశలవారీగా నెట్‌వర్క్‌ను, ఉత్పత్తిని పెంచుతామన్న ఆయన 3-4 ఏండ్లలో దేశవ్యాప్తంగా సుమారు 300 డీలర్‌షిప్‌లను అందుబాటులోకి తెస్తామని, 1.5 లక్షల యూనిట్ల అమ్మకాలను సాధిస్తామన్న విశ్వాసాన్ని వెలిబుచ్చారు. ఇక 2026 ఆగస్టుకల్లా దాదాపు 40వేల యూనిట్లను ఉత్పత్తి చేసే యోచనలో ఉన్నట్టు చెప్పారు. ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌కూ విస్తరించే యోచనలో ఉన్నట్టు వివరించారు. కాగా, పుణెకు చెందిన ఈ సంస్థ 1984 నుంచి 1998 వరకు డీఎక్స్ పేరుతో స్కూటర్లను విక్రయించిన విషయం తెలిసిందే.

## ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పేడే సేల్ ఆఫర్

**విమాన టికెట్లపై 15 శాతం వరకు రాయితీ**

**హైదరాబాద్:** ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..విమాన టికెట్లపై ప్రత్యేక రాయితీని ప్రకటించింది. 'పేడే సేల్' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ కింద టికెట్లపై 15 శాతం వరకు తగ్గింపు ధరతో అందిస్తున్నది. ఈ ప్రత్యేక ఆఫర్ ఆగస్టు 1 వరకు బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే వర్తించనున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు మార్చి 31, 2026 లోపు ఎప్పుడైనా ప్రయాణించవచ్చునని తెలిపింది. %షఙఙ.ఖఱతీఱఅఎఙఖువఇజూతీవంం.ఎశీఎ%, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని సూచించింది. దీంతోపాటు బ్యాగేజీపై కూడా డిస్కౌంట్ కల్పిస్తున్నది. అదనంగా తీసుకుపోయే 15 కిలోల సరుకునకు రూ.1,000, అంతర్జాతీయ రూట్‌లో 20 కిలోల బ్యాగేజీకి రూ.1,300 తగ్గిస్తున్నట్టు వెల్లడించింది.

## ఐపీవోకి నెఫ్రోప్లస్!




**హైదరాబాద్ :** ఆసియాలోనే అతిపెద్ద డయాలిసిస్ సేవల సంస్థ నెఫ్రోప్లస్ బ్రాండ్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్..పబ్లిక్ ఇష్యూకి(ఐపీవో)కి సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.27 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో విక్రయించడం ద్వారా రూ.353.4 కోట్ల వరకు నిధులు సమీకరించాలని యోచిస్తున్నది. ఇలా సేకరించిన నిధుల్లో రూ.129 కోట్లను నూతన డయాలిసిస్ క్లినిక్‌లను తెరువడానికి, మరో రూ.136 కోట్లను రుణాలను తీర్చడానికి వినియోగించనున్నది.


# విఎఫెక్స్ పనుల్లో విశ్వంభర

## హరిహరవీరమల్లులో కొన్ని సీన్ల తొలగింపు



దాదాపు అయిదేళ్ల చిత్రీకరణ తర్వాత.. పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన.. 'హరిహర వీరమల్లు' భారీ అంచనాల మధ్య ఈనెల 24న థియేటర్లలో విడుదలైంది. ఈ పాన్ఇండియా మూవీ ఇప్పటివరకు దేశవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సుమారు రూ.75 కోట్ల వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమాలో కొన్ని సన్నివేశాల్లో వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్‌లు సరిగా లేవని సోషల్ మీడియా వేదికగా చర్చ జరుగుతోంది. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఆ చిత్ర బృందం అలాంటి కొన్ని సీన్లను సినిమాలోంచి తొలగించింది. హీరో, అతడి అనుచరులు కొండ అంచున గుర్రాలపై స్వారీ చేసే సీన్‌ను కుదించారు. అలాగే జెండా సన్నివేశాన్ని పూర్తిగా తొలగించారు. పవన్ బాణాలు సంధించే యాక్షన్ సీన్‌లో చిన్నచిన్న మార్పులు చేశారు. క్లైమాక్స్ నిడివి కూడా బాగా తగ్గింది. ఇలా మొత్తంగా 10 నుంచి 15 నిముషాల ఫుటేజీని సినిమా నుంచి తొలగించారు. ప్రస్తుతం థియేటర్లలో ఈ సవరించిన వెర్షనే ప్రదర్శితమవుతోంది. అయితే ఈ సన్నివేశాల తొలగింపు గురించి చిత్రబృందం ఎలాంటి ప్రకటనా చేయలేదు.

## అమెజాన్‌లో 8నుంచి అరేబియా కడలి స్ట్రీమింగ్




సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సిరీస్ 'అరేబియా కడలి' ఓటిటి వేదికగా విడుదలవుతోంది. సూర్యకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీకి స్టార్ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి దీనికి రైటర్‌గా పని చేయడంతో పాటు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా కూడా వ్యవహరించారు. దీంతో ఈ సిరీస్‌పై ఆసక్తి నెలకొంది. అమెజాన్‌లో ఆగస్టు 8 నుంచి అందుబాటులోకి రానున్నట్లు- తెలిపింది. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లోనూ ఇది అందుబాటులోకి రానున్నట్లు- అమెజాన్ ప్రైమ్ తెలిపింది. 'కాలానికి అందరూ సమానమే. అందరూ ఒడుదొడుకులను ఎదుర్కోవాల్సిందే' అంటూ పోస్టర్‌ను పంచుకుంది. రెండు గ్రామాలకు చెందిన కొందరు మత్స్యకారులు అనుకోకుండా బార్డర్ క్రాస్ చేస్తారు. దీంతో వాళ్లను విదేశీ జైల్లో బంధిస్తారు. అక్కడినుంచి వాళ్లు ఎలా బయటకు వచ్చారనే కథాంశంతో ఈ సిరీస్‌ను తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఇది రూపొందింది. 2024లోనే దీని చిత్రీకరణ ప్రారంభించారు. అయితే ఇటీవల ఇదే కథాంశంతో కొన్ని చిత్రాలు రూపొందినప్పటికీ ఈ కథ ఒరిజినల్ అని సంస్థ పేర్కొంది. ఇందులో సత్యదేవ్ సరసన ఆనంది నటించారు.

## పంత్‌ను ఎంత ప్రశంసించినా తక్కువే

### టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌ను డ్రా చేసుకోవడంపై టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ సంతోషం వ్యక్తం చేశాడు. భారత జట్టు అద్వితీయమైన పోరాటంతోనే ఇది సాధ్యమైందని కొనియాడాడు. గాయంతో బ్యాటింగ్ చేసిన రిషభ్ పంత్‌ను ఎంత పొగిడినా తక్కువేనన్నాడు. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ అజేయ శతకాలతో చెలరేగి టీమిండియాను గట్టెక్కించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న గౌతం గంభీర్ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. తమ ఆటగాళ్ల సెంచరీల ముందు డ్రా కోసం ప్రయత్నించిన బెన్ స్టోక్స్ తీరును తప్పుబట్టాడు. 'ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడం గర్వంగా ఉంది. చాలా మంది మా జట్టును తక్కువ అంచనా వేసారు. కానీ మా ఆటగాళ్లు అద్భుతమైన పోరాటంతో ఓటమి నుంచి గట్టెక్కించారు. దేశం కోసం మా ఆటగాళ్లు పోరాడుతారు. శుభ్‌మన్ గిల్ ప్రతిభపై ఎలాంటి సందేహం అవసరం లేదు. క్రికెట్ గురించి తెలియని వారికే అతనిపై సందేహాలు ఉంటాయి. శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ ఏ మాత్రం భారం కాదు.

### సెప్టెంబర్‌కు విడుదల అనుమానమే?

మెగాస్టార్ చిరంజీవి హీరోగా యంగ్ దర్శకుడు వసిష్ఠ మల్లిడి డైరెక్షన్ లో వస్తున్ సోషియో ఫాంటాషి సినిమా 'విశ్వంభర'. చిరు సరసన కోలీవుడ్ స్టార్ బ్యూటీ- త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. వంశి ప్రమోద్ భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. అనుకోని కారణాల వలన షూటింగ్ డిలే అవుతూ వస్తున్న ఈ సినిమా స్పెషల్ సాంగ్ షూటింగ్ ను ఇటీవల ఫినిష్ చేసారు. మౌని రేయ్ చిరు సరసన స్టెప్పులేస్తోంది. దాంతో షూటింగ్ మొత్తం పూర్తిఅయింది. ఎప్పుడో విడుదల కావాల్సిన విశ్వంభర విఎఫెక్స్ వర్క్ కారణంగా వాయిదా పడుతూ వస్తోంది. విశ్వంభర రిలీజ్ కు వచ్చిన నెగిటివ్ కామెంట్స్ ను దృష్టిలో పెట్టుకుని రీ వర్క్ చేస్తున్నారు. దాదాపు రూ. 75 కోట్లు- విఎఫెక్స్ కోసం ఖర్చు పెడుతోంది. ఇదిలా ఉండగా విఎఫెక్స్ వర్క్ ఆగస్టు చివరి నాటికి ఫినిష్ అవుతుందని సెప్టెంబర్ 25 న విశ్వంభర రిలీజ్ అని టాలీవుడ్ లో వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ ఇప్పటికే అదే డేట్ కు బాలయ్య -బోయపాటిల అఖండ 2, పవర్ స్టార్ క్షప రెడీ గా ఉన్నాయి. దాంతో ఆ రెండు సినిమాలతో పోటీ- ఎందుకు అందుకున్నారో ఏమో విశ్వంభరను మరోసారి వాయిదా వేసేందుకు రెడీ అయ్యారు. విశ్వంభర సెప్టెంబర్ రేస్ నుండి తప్పుకుని డిసెంబరుకు వెళ్తోంది. రాజాసాబ్ సంక్రాంతికి వెళ్లే అవకాశం ఉంది.




## ఫిడే మహిళల ప్రపంచకప్ విజేతగా దివ్య దేశ్‌ముఖ్

### ఫైనల్లో కోనేరు హంపి ఓటమి

ప్రపంచ మహిళల చెస్ చాంపియన్ గా దివ్య దేశ్ ముఖ్ విజయం సాధించారు. టైబ్రేక్ కు దారి తీసిన ఫైనల్లో దివ్య .. కోనేరు హంపీని ఓడించారు. దివ్య దేశ్ ముఖ్ వయసు 19 ఏళ్లు మాత్రమే. చిన్న వయసులోనే ప్రపంచ కప్ టైటిల్ సాధించి రికార్డు సృష్టించారు. ఫైన్‌లో హంపి తీవ్రంగా పోరాడింది, కానీ దివ్య దేశ్‌ముఖ్ తన కొత్త తరహా ఆటతో హంపీని ఓడించింది. ఫైనల్‌లో గెలవడం ద్వారా దివ్య గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను డైరెక్ట్ గా సాధించేసినట్లయింది. గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను సాధించడానికి, ఒక ఆటగాడు మూడు %+వీ% నార్మ్‌లను, 2500 రేటింగ్‌ను సాధించాలి. దివ్య ఫిడే మహిళల వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా డైరక్ట్ టైటిల్ సాధించారు.ఇది ఆమెను కొనేరు హంపీ, హారిక ద్రోణవల్లి, ఆర్. వైశాలి తర్వాత భారతదేశం నాల్గవ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచేలా చేస్తుంది. ఫిడే నిబంధనల ప్రకారం మూడు నార్మ్‌లు , 2500 రేటింగ్ అవసరాన్ని దాటవేస్తుంది. దివ్య ఆక్రమణాత్మక , టాక్టికల్ చెస్ ఆడటంలో మంచి నైపుణ్యం సాధించారు. 19 సంవత్సరాల వయస్సులో, దివ్య తన ఆటలో అసాధారణమైన పరిపక్వతను ప్రదర్శిస్తున్నారని చెస్ ప్లేయర్లు ప్రశంసిస్తున్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ కు చెందిన దివ్యా దేశ్ ముఖ్ 2021లో భారతదేశం 21వ మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచారు. ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్‌ను గతంలోనే పొందారు. 2025 ఫిడే మహిళల వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరుకోవడం ద్వారా ఆమె మొదటి గ్రాండ్‌మాస్టర్ నార్మ్‌ను సాధించింది. ఇప్పుడు టైటిల్ కూడా సాధించి తిరుగులేని భవిష్యత్ ఉందని నిరూపించింది. దివ్య దేశ్‌ముఖ్ అనేక అంతర్జాతీయ జాతీయ టోర్నమెంట్లలో అద్భుతమైన ప్రతిభ చూపింది. జూన్ 2024లో, దివ్య 18 సంవత్సరాల వయస్సులో వరల్డ్ జూనియర్ గర్ల్స్ టైటిల్‌ను గెలుచుకుంది, కొనేరు హంపీ (2001), హారిక ద్రోణవల్లి (2008), సౌమ్య స్వామినాథన్ (2009) తర్వాత ఈ టైటిల్ గెలిచిన నాల్గవ భారతీయ చెస్ ప్లేయర్ గా నిలిచారు. కోనేరు హంపితో పోలిస్తే దివ్య



దేశ్‌ముఖ్ పెద్దగా అనుభవం లేని క్రీడాకారిణి. నాగపూర్‌కు చెందిన దివ్య, సీనియర్ విభాగంలో ఆడిన టోర్నీలు కూడా తక్కువగానే ఉన్నాయి. ఈ టోర్నీ ఫైనల్స్ ముందు వరకు గ్రాండ్‌మాస్టర్ హోదా కూడా అందుకోలేదు. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదాను పొందింది దివ్య. ఆ తర్వాత 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఒలింపియాడ్‌లో మూడు పసిడి పతకాలు కూడా దివ్య ఖాతాలో ఉన్నాయి. గతేడాది తొలిసారి 2500 ఎలో రేటింగ్‌ను అందుకుంది. దూకుడైన ఆటతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతినిపిస్తోంది. తాజాగా ప్రపంచకప్‌లో తనకన్నా మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక (క్వార్టర్‌ఫైనల్), జు జినర్ (ప్రిక్వార్టర్స్)పై నెగ్గడమే ఇందుకు ఉదాహరణ. సెమీస్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ జాగ్‌యిపై గెలవడం ఆమెను మరో మెట్టు ఎక్కించింది. ఇక మహిళల ప్రపంచ ఛాంపియన్?గా నిలిచిన దివ్య దేశ్?ముఖ్?ను విశ్వనాథన్ ఆనంద్ అభినందిస్తూ ఎక్స్?లో పోస్ట్ చేశారు. ఇది ఉక్కంఠ భరితమైన పోరుని, కోనేరు హంపి కూడా మంచి ఆటతీరు పోరాటస్ఫూర్తిని కనబర్చారని తెలిపారు. భారత చదరంగానికి ఇది సంబరాలను తెచ్చిన విజయం ఇది అంటూ రాసుకొచ్చారు.

## గిల్ ప్రత్యర్థికి స్ట్రాంగ్ కౌంటర్ ఇస్తే బాగుండేది

### బెన్ స్టోక్స్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సునీల్ గావస్కర్

మాంచెస్టర్ టెస్టు చివరి రోజున ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వ్యవహరించిన తీరుపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలి టెస్ట్ తర్వాత స్టోక్స్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తిరిగి వారికే తగిలాయని గుర్తు చేశారు. ముందస్తు 'డ్రా' ఎత్తులు వేసిన బెన్‌స్టోక్స్‌కు గిల్ కొన్ని ప్రశ్నలు సంధించి ఉంటే బాగుండేదని భారత్? సారథికి సూచించారు.

అంతేకాకుండా టెస్టు క్రికెట్ చరిత్రలో ఈ మ్యాచ్ నిలిచిపోతుందని, టీమ్ఇండియా పోరాటం అద్భుతమని కొనియాడారు'నాకు ఇది చాలా సంతృప్తి ఇచ్చిన మ్యాచ్. భారత జట్టు ఆడిన తీరుపై నేను చాలా గర్వపడుతున్నా. కేవలం నాలుగు వికెట్లను మాత్రమే ప్రత్యర్థికి ఇచ్చారు. మంచి పిచ్, ఫ్లాట్ పిచ్ ఏదైనా సరే తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పుడు ప్లేయర్ల ఆట ఆకట్టుకుంది. అయితే నేను ఇక్కడ నేను ఇంగ్లాండ్ జట్టును చాలా ప్రశ్నలు అడగాలని అనుకుంటున్నా. బర్మింగ్ హామ్‌లో జరిగిన మ్యాచ్?లో ఇంగ్లాండ్?కు భారత జట్టు 600o టార్గెట్‌ను ఇచ్చింది. ఆ సమయంలో టీమ్ఇండియా భయపడిందని అంటూ ఇంగ్లాండ్ నుంచి వ్యాఖ్యలు వినిపించాయి. అంతకుముందు లీడ్స్‌లో 370o లక్ష్యాన్ని కొట్టిన జోష్?లో ఎంతైనా కొడతామని ఇంగ్లాండ్ ప్రగల్భాలు పలికింది. కానీ రెండో టెస్టులో మాత్రం 336 పరుగుల తేడాతో ఓడింది. మరి ఆ ధైర్యం ఏమైంది?' అని గావస్కర్ వ్యాఖ్యానించాడు. అలాగే శుభ్?మన్? గిల్? కూడా ప్రత్యర్థికి గట్టిగా బదులు ఇచ్చి ఉంటే బాగుండేదని సునీల్ గావస్కర్ అన్నారు. ఈ విషయంలో కాస్త కఠినంగా వ్యవహరించాలని, మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చుంటే బాగుండేదని సూచించారు. అప్పుడు స్టోక్స్‌కు కొన్ని ప్రశ్నలు సంధించమని గిల్‌కు చెప్పేవాడినని అన్నారు. 'నువ్వు ఎందుకు 311 పరుగుల వరకూ ఆధిక్యం తీసుకెళ్లావు? 240 పరుగుల లీడ్‌తో సరిపెట్టుకోవచ్చుగా? కనీసం బెన్ స్టోక్స్ సెంచరీ తర్వాతనైనా డిక్లేర్డ్ చేయొచ్చుగా? అప్పుడు మీ బౌలర్లకు అదనంగా మరో గంట సమయం ఇవ్వొచ్చుగా?' అనే ప్రశ్నలు అడిగించేవాడిని అన్ని తెలిపారు. అయితే, గిల్ అలా అడుగుతాడని అనుకోలేదని, అతడు మరీ సున్నితంగా ఉండే వ్యక్తి అని చెప్పారు. కానీ, తాను మాత్రం కచ్చితంగా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ప్రశ్నించేవాడినేని తెలిపారు. ఇప్పుడైనా ఇవే ప్రశ్నలు అడుగుతానని గావస్కర్ వ్యాఖ్యానించారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, at Sri Venkateshwara Printers. Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Districrt : Khammam Editor: Shaik Yacoob Pasha, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609